www.prajavinikidi.com
RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక
తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -144 సోమవారం 7 సెప్టెంబర్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## ఢిల్లీలో కూలిన భవనం.. ముగ్గురి మృతి

ఢిల్లీలోని సత్య నికేతన్‌లో ఘోర ప్రమాదం

ఈ ప్రమాదంలో ముగ్గురు మరణించగా, పలువురిని కాపాడిన సహాయక బృందాలు

మరమ్మతు పనులు చేస్తుండగా పాత భవనం కూలిపోయినట్లు వెల్లడి

ప్రభుత్వ నిర్లక్ష్యంపై విపక్షాలు ఆగ్రహం, ఉన్నతస్థాయి విచారణకు డిమాండ్

శిథిలాల కింద పలువురు విద్యార్థులు చిక్కుకున్నట్లు అనుమానాలు



**ఢిల్లీ (ప్రజావినికిడి):**
దేశ రాజధాని ఢిల్లీలో ఆదివారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. సౌత్ ఢిల్లీలోని సత్య నికేతన్ ప్రాంతంలో మరమ్మతు పనులు జరుపుకుంటున్న ఐదంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో ముగ్గురు మృతి చెందగా, ఇప్పటివరకు ఆరుగురిని సహాయక బృందాలు సురక్షితంగా వెలికితీశాయి. **మిగతా 2లో...**

## ఇస్రో ప్రైవేటీకరణ అవాస్తవం

ప్రైవేటీకరణ వార్తలను ఖండించిన భారత అంతరిక్ష సంస్థ

మా పాత్ర తగ్గదు, మరింత కీలకమవుతుందని స్పష్టీకరణ

అధునాతన పరిశోధనలపై దృష్టి పెడతామన్న ఇస్రో

ప్రైవేట్ రంగ భాగస్వామ్యం సామర్థ్యాన్ని పెంచడానికేనని వెల్లడి




**ఢిల్లీ (ప్రజావినికిడి):**
భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)ను ప్రైవేటీకరిస్తున్నారంటూ గత కొద్ది రోజులుగా మీడియాలో వస్తున్న ఊహాగానాలకు సంస్థ ఆదివారం పూర్తిస్థాయిలో తెరదించింది. ఇస్రోను ప్రైవేటీకరించే ఆలోచన లేదని, దేశ అంతరిక్ష ప్రయోగాలలో దాని ప్రాధాన్యం ఎప్పటికీ తగ్గదని స్పష్టం చేసింది **మిగతా 2లో....**

## సాత్విక్-చిరాగ్ సంచలనం..

### చైనా మాస్టర్స్ టైటిల్ సొంతం



చైనా మాస్టర్స్ సూపర్ 750 టైటిల్‌ను గెలుచుకున్న సాత్విక్-చిరాగ్

ఫైనల్‌లో చైనా జోడీపై హోరాహోరీ పోరులో విజయం

తొలి గేమ్ కోల్పోయినా అద్భుతంగా పుంజుకున్న భారత ద్వయం

ఈ సీజన్‌లో సాత్విక్-చిరాగ్ జోడీకి ఇది రెండో టైటిల్

గాయాలతో బాధపడుతున్నా అద్భుత ప్రదర్శన కనబర్చిన భారత జోడీ

**ఢిల్లీ (ప్రజావినికిడి):**
భారత స్టార్ బ్యాడ్మింటన్ ద్వయం సాత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి, చిరాగ్ శెట్టి సంచలనం సృష్టించారు. ప్రతిష్ఠాత్మక చైనా మాస్టర్స్ సూపర్ 750 పురుషుల డబుల్స్ టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. షెన్‌జెన్‌లోని అరీనాలో ఆదివారం జరిగిన హోరాహోరీ ఫైనల్‌లో చైనా జోడీ **మిగతా 2లో...**

# ప్రతిపక్ష హోదాను అపహాస్యం చేస్తున్న కేసీఆర్

తక్షణం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయండి : మహాధర్నాలో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ డిమాండ్

బీఆర్ ఎస్ పదేండ్ల పాలన.. కాంగ్రెస్ రెండున్నరేండ్ల పాలనపై చర్చకు సిద్ధమంటూ సవాల్

హాజరైన మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం, అజారుద్దీన్, -పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు



## మూడేళ్లలో డ్రగ్స్ రహిత భారత్

నాలుగు స్థాయిల్లో నార్కో సమన్వయ కేంద్రాలు

మార్చి2029 నాటికి మత్తు చిత్తు

కేంద్ర హోం మంత్రి అమిత్ షా



పనాజీ:(ప్రజావినికిడి):
కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదివారం గోవాలోమీడియాతో మాట్లాడుతూ, 2029 నాటికి భారతదేశాన్నిపూర్తిగా మాదకద్రవ్య రహితంగా మార్చేందుకు మోడీ ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసిందనితెలిపారు. మాదకద్రవ్యాలు లేని యువశక్తి 2047 నాటికివికసిత భారత్ను నడిపిస్తుందనేది ప్రధాని నరేంద్ర మోడీలక్ష్యమని పేర్కొన్నారు. నక్సలిజం, ఉగ్రవాదం వంటి ముప్పులను ఎలా **మిగతా 2లో...**

## కొత్త పింఛన్లకు దరఖాస్తులు

### నేటి నుంచి 16 వరకు స్వీకరణ

ఎన్టీఆర్ భరోసాలో కొత్త అధ్యాయం



**అమరావతి, (ప్రజావినికిడి):**
రాష్ట్రంలో కొత్త పింఛన్లకోసం ఎంతగానో ఎదురు చూస్తున్న పేదలకుప్రభుత్వం తీపి కబురు అందించింది. నేటి నుంచి ఈనెల 16వరకు దరఖాస్తులు స్వీకరించనుంది. ఇప్పటికే సామాజిక భద్రత పింఛన్లతో 62 లక్షల మంది పేదలకు ప్రతినెలా ఆర్థిక భరోసా కల్పిస్తున్న కూటమి ప్రభుత్వం, ఇప్పుడు ఆ భరోసాను మరింత విస్తరించేందుకు సిద్ధమైంది. అర్హులైన పేదలు, వృద్ధులు, వితంతువులు,దివ్యాంగులు, ఇతర బలహీన వర్గాలకు కొత్తగా అవకాశం కల్పిస్తూ ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకంకింద తాజా దరఖాస్తుల స్వీకరణకు శ్రీకారం చుట్టింది. **మిగతా 2లో...**




## 8 హైకోర్టులకు కొత్త చీఫ్ జస్టిస్‌లు..



**హైదరాబాద్ : (ప్రజావినికిడి):**
దేశంలోని న్యాయవ్యవస్థలో కీలక నియామకాలు జరిగాయి. సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫార్సుల మేరకు ఎనిమిది హైకోర్టులకు కొత్త ప్రధాన న్యాయమూర్తులను (సీజే) నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు **2లో...**

## అసెంబ్లీ సమావేశాల తర్వాత పాదయాత్ర

కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా కేసీఆర్ భారీ ఉద్యమం

కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టులపై నిర్లక్ష్యమే ప్రధాన కారణమన్న హరీశ్ రావు

సీఎం రేవంత్ భాష వల్లే కేసీఆర్ సభకు రావట్లేదన్న వెల్లడి

అసెంబ్లీ లోపల, బయట సర్కారును నిలదీయాలని బీఆర్ఎస్ నిర్ణయం

ముందు రేవంత్ రాజీనామా చేయాలని డిమాండ్

**హైదరాబాద్ : (ప్రజావినికిడి):**
తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రత్యక్ష పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ సిద్ధమైంది. సోమవారం ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల తర్వాత, కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నేరుగా భారీ ప్రజా ఉద్యమాన్ని ప్రారంభించనున్నారని పార్టీ ప్రకటించింది.
ఆదివారం ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ అధ్యక్షతన జరిగిన బీఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. సమావేశం అనంతరం **మిగతా 2లో...**

## హైదరాబాద్‌లో ట్రాన్స్‌జెండర్ల ఆగడాలపై డీజీపీ సీవీ ఆనంద్ సీరియస్

ట్రాన్స్‌జెండర్ల బలవంతపు వసూళ్లపై స్పెషల్ డ్రైవ్‌కు డీజీపీ ఆదేశం

గతంలోనూ ఇలాంటి దందాలను అరికట్టామని వెల్లడి

చింతల్‌లో గృహప్రవేశం వద్ద రూ. 50 వేలు డిమాండ్ చేసిన ఘటన వైరల్

ప్రభుత్వ ప్రోత్సాహంతో పలువురు ట్రాన్స్‌జెండర్లు మంచి పేరు తెచ్చుకున్నారని ప్రశంస

అన్ని కమిషనరేట్ల పరిధిలో తనిఖీలు చేపట్టాలని పోలీసులకు సూచన



**హైదరాబాద్ : (ప్రజావినికిడి):**
కొందరు ట్రాన్స్‌జెండర్లు శుభకార్యాల వద్ద బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్న ఘటనలపై తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తీవ్రంగా స్పందించారు. ఇలాంటి బెదిరింపులు, దోపిడీలను అరికట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా మరోసారి ప్రత్యేక డ్రైవ్ (స్పెషల్ డ్రైవ్) చేపట్టాలని అన్ని కమిషనరేట్ల సీపీలను ఆదేశించనున్నట్లు ఆయన **మిగతా 2లో...**

## ఏపీ కాంగ్రెస్‌కు కొత్త ఇన్‌ఛార్జ్.. పీవీ మోహన్‌కు బాధ్యతలు

ప్రస్తుత ఇన్‌ఛార్జ్ మాణికం ఠాగూర్‌పై వేటు

ఏపీకి చెందిన సిరివెళ్ల ప్రసాద్‌కు మహారాష్ట్ర ఇన్‌ఛార్జ్ బాధ్యతలు

పంజాబ్‌కు సచిన్ పైలట్, అస్సాంకు భూపేష్ భగేల్ ఇన్‌ఛార్జ్‌లు

నియామకాలను ప్రకటించిన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్



**అమరావతి, (ప్రజావినికిడి):**
అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) పార్టీలో పలు కీలక మార్పులు చేపట్టింది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జిగా కర్ణాటకకు **మిగతా 2లో...**

# అసెంబ్లీ సమావేశాల తర్వాత పాదయాత్ర

**మొదటిపేజీ తరువాయి**
వివరాలను అసెంబ్లీలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మీడియాకు వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నీళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే నీటిని ఎత్తిపోయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆయన ఆరోపించారు. తమ ప్రభుత్వం 80 శాతం పూర్తి చేసిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు మిగిలిన పనులు పూర్తిచేస్తే 60 టీఎంసీల నీరు అందుబాటులోకి వస్తుందని, కానీ కాంగ్రెస్ సర్కారు కక్షపూరితంగా దాన్ని పక్కనపెట్టిందని విమర్శించారు."ఈ రెండు ప్రాజెక్టుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా, రాబోయే రోజుల్లో స్వయంగా కేసీఆర్ లక్షలాది మందితో ప్రత్యక్ష ప్రజా ఉద్యమానికి నాయకత్వం వహించాలని ఈ సమావేశంలో నిర్ణయించాం" అని హరీశ్ రావు తెలిపారు.
అసెంబ్లీలోనూ ప్రభుత్వాన్ని పలు అంశాలపై నిలదీస్తామని హరీశ్ రావు స్పష్టం చేశారు. సెక్షన్ 22ఏ కింద భూములను 'నిషేధిత జాబితా'లో చేర్చి రైతులను వేధించడం, విద్యుత్ కోతలు, రుణమాఫీ వైఫల్యం, పాలిటెక్నిక్ జీవో 97 రద్దు, సింగరేణి కుంభకోణాలు, పీఆర్సీ, డీఏలు, ఈహెచ్ఎస్ అమలులో వైఫల్యాలపై ప్రభుత్వాన్ని గట్టిగా ప్రశ్నిస్తామన్నారు.
అసెంబ్లీకి కేసీఆర్ హాజరుకాకపోవడంపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను హరీశ్ రావు తిప్పికొట్టారు. "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వాడే వీధి స్థాయి భాషను వినడానికి కేసీఆర్ అసెంబ్లీకి రావాల్సిన అవసరం లేదు" అని ఆయన వ్యాఖ్యానించారు. గతంలో ఎన్టీఆర్, జయలలిత, చంద్రబాబు వంటి నేతలు శాసనసభలో అవమానాలకు గురైనప్పుడు సభను బహిష్కరించి, ప్రజా తీర్పుతో తిరిగి ముఖ్యమంత్రులుగా వచ్చారని, కేసీఆర్ కూడా అదే మార్గంలో పయనిస్తున్నారని అన్నారు.
ప్రతిపక్ష నేత భద్రత ఖర్చుపై మాట్లాడే సీఎం రేవంత్ రెడ్డి, కనీసం వార్డు మెంబర్‌గా కూడా లేని తన సోదరుడు తిరుపతి రెడ్డికి నలుగురు గన్‌మెన్లను పెట్టి రూ.40 కోట్లు ఖర్చు చేస్తున్నారని హరీశ్ రావు ఆరోపించారు. 30 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల అంశాన్ని కూడా సభలో ప్రస్తావిస్తామన్నారు. ప్రజా సమస్యలపై సమగ్ర చర్చకు వీలుగా అసెంబ్లీ సమావేశాలను నెల రోజుల పాటు నిర్వహించాలని డిమాండ్ చేశారు.
కేసీఆర్ రాజీనామా చేయాలన్న కాంగ్రెస్ డిమాండ్‌పై స్పందిస్తూ.. 'ఆరు గ్యారెంటీలు', రుణమాఫీ హామీని నిలబెట్టుకోనందుకు ముందుగా సీఎం రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. పాలన చేతగాక, ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతుండటంతోనే.. కేసీఆర్ రాజీనామా అంశాన్ని తెరపైకి తెచ్చి ప్రజల దృష్టిని మళ్లిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్నా.. విద్యార్థులు, నిరుద్యోగులు, రైతులు, మహిళలు, దళిత, గిరిజన, బీసీ వర్గాలను దారుణంగా మోసం చేసిందని విమర్శించారు.

# ఇస్రో ప్రైవేటీకరణ అవాస్తవం

**మొదటిపేజీ తరువాయి**
ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఒక సుదీర్ఘ ప్రకటన విడుదల చేసింది.ఇస్రో భవిష్యత్ పాత్రపై కొన్ని మీడియా సంస్థలు అసత్యాలు, తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నాయని, ఈ కథనాలు పూర్తిగా నిరాధారమైనవని ఇస్రో పేర్కొంది. "ఇస్రోను ప్రైవేటీకరించరు, దాని ప్రాముఖ్యాన్ని తగ్గించరు. అత్యాధునిక అంతరిక్ష పరిశోధనలు, సాంకేతిక అభివృద్ధి, వ్యూహాత్మక ప్రయోగాలు, అంతరిక్ష విజ్ఞానం, అన్వేషణ వంటి కీలక రంగాలలో ఇస్రో దేశానికి ప్రధాన సంస్థగా కొనసాగుతుంది" అని ఆ ప్రకటనలో తేల్చిచెప్పింది.
అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం వెనుక ఉద్దేశం ఇస్రో పాత్రను తగ్గించడం కాదని, మరింత ఉన్నతమైన లక్ష్యాలపై దృష్టి సారించేలా చేయడమేనని వివరించింది. 2020లో ప్రారంభమైన సంస్కరణలు, 2023 భారత అంతరిక్ష విధానం ద్వారా దేశంలో బలమైన, ప్రపంచంతో పోటీపడగల అంతరిక్ష పర్యావరణ వ్యవస్థను నిర్మించడమే లక్ష్యమని తెలిపింది. దీనివల్ల ఇస్రో ప్రాధాన్యం తగ్గదని, భారత అంతరిక్ష పర్యావరణ వ్యవస్థ స్వరూపం, సామర్థ్యం విస్తరిస్తాయని పేర్కొంది.సాంకేతికంగా అభివృద్ధి చెందిన, పునరావృతమయ్యే పనులను పరిశ్రమలకు అప్పగించడం ద్వారా ఇస్రో శాస్త్రవేత్తలు, సిబ్బంది తమ సమయాన్ని అధునాతన పరిశోధనలు (ఆర్ అండ్ డీ), కొత్త తరం టెక్నాలజీలు, సంక్లిష్టమైన జాతీయ ప్రాజెక్టులపై కేంద్రీకరించగలరని ఇస్రో తెలిపింది. ఇది "ఇస్రో నేతృత్వంలోని జాతీయ అంతరిక్ష పర్యావరణ వ్యవస్థ"కు నాంది పలుకుతుందని వివరించింది.
భవిష్యత్ లక్ష్యాలు ఇవే..
భవిష్యత్తులో ఇస్రో పాత్ర మరింత బలోపేతం కానుంది. ముఖ్యంగా, మానవసహిత అంతరిక్ష యాత్రలు (గగన్‌యాన్), కొత్త తరం ప్రయోగ వాహనాలు, చంద్రుడు, ఇతర గ్రహాలపై పరిశోధనలు, 2035 నాటికి 'భారతీయ అంతరిక్ష్ స్టేషన్' ఏర్పాటు, 2040 నాటికి చంద్రుడిపైకి భారతీయుడిని పంపడం వంటి భారీ లక్ష్యాలపై ఇస్రో దృష్టి పెడుతుంది.
ప్రస్తుతం 8.4 బిలియన్ డాలర్లుగా ఉన్న భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థను 2033 నాటికి 44 బిలియన్ డాలర్లకు పెంచడమే లక్ష్యం. ఈ స్థాయి వృద్ధిని కేవలం ప్రభుత్వ వనరులతో సాధించడం అసాధ్యమని, దీనికి ప్రైవేట్ పెట్టుబడులు, పారిశ్రామిక సామర్థ్యం, ప్రపంచ మార్కెట్ అవసరమని ఇస్రో స్పష్టం చేసింది. 2020లో కొన్ని మాత్రమే ఉన్న స్పేస్ స్టార్టప్‌లు, నేడు 450కి పైగా పెరగడమే ఈ సంస్కరణల విజయానికి నిదర్శనమని పేర్కొంది.

# ఢిల్లీలో కూలిన భవనం.. ముగ్గురి మృతి

**మొదటిపేజీ తరువాయి**
శిథిలాల కింద మరికొంతమంది చిక్కుకుని ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఉన్నతస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి.
పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కూలిపోయిన భవనం సుమారు 40-50 ఏళ్ల నాటిది. బేస్‌మెంట్‌తో కలిపి మొత్తం ఐదు అంతస్తులున్న ఈ భవనాన్ని పేయింగ్ గెస్ట్ (పీజీ) వసతి గృహంగా ఉపయోగిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో బేస్‌మెంట్‌లో మరమ్మతు పనులు జరుగుతున్నాయి. శిథిలాల కింద నుంచి వెలికితీసిన ఒక వ్యక్తిని ఎయిమ్స్ ట్రామా సెంటర్‌కు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.ఈ ఘటనపై కాంగ్రెస్ ఎంపీ దీపేందర్ సింగ్ హుడా మాట్లాడుతూ, ఇది రాజకీయ విమర్శలు చేసే సమయం కానప్పటికీ, జవాబుదారీతనం ఎక్కడ అని ప్రశ్నించారు. "ఈ ప్రాంతంలో పీజీలు ఏ పరిస్థితుల్లో నడుస్తున్నాయో అందరికీ తెలుసు. వాటికి లేఅవుట్ ప్లాన్లను ఎవరు మంజూరు చేస్తున్నారు? అగ్నిమాపక భద్రతను ఎవరు ధ్రువీకరిస్తున్నారు? మున్సిపల్ కార్పొరేషన్, ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యేల పాత్ర ఏమిటి? ఎవరో ఒకరు బాధ్యత వహించాలి" అని ఆయన నిలదీశారు. విద్యార్థులే శిథిలాల నుంచి ముగ్గురిని బయటకు లాగారని, ప్రభుత్వం దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.
ఆప్ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఈ ఘటనను అత్యంత విషాదకరమని అభివర్ణించారు. "ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఢిల్లీలో ఇలాంటి ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. ప్రభుత్వం ఇకనైనా నిద్రమత్తు వీడి పౌరుల భద్రతకు చర్యలు తీసుకోవాలి" అని ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఢిల్లీ అసెంబ్లీ ప్రతిపక్ష నేత, మాజీ సీఎం అతిషి కూడా ఈ ఘటనపై ఉన్నతస్థాయి విచారణకు డిమాండ్ చేశారు. నిర్లక్ష్యానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటేనే భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కావని ఆమె పేర్కొన్నారు.
సమీపంలోనే ప్రచారం చేస్తున్న ఎన్ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షుడు వినోద్ జాఖర్, తాము ఘటనాస్థలికి చేరుకుని ముగ్గురిని కాపాడామని తెలిపారు. ప్రమాద స్థలంలో విద్యార్థులకు చెందిన పుస్తకాలు కనిపించాయని, ప్రభుత్వ వైఫల్యమే ఈ దుర్ఘటనకు కారణమని ఆరోపించారు.
ప్రమాదం జరిగిన భవనం పక్కనే ఉన్న పీజీలో నివసించే ఓ విద్యార్థి మాట్లాడుతూ, "భోజనం చేశాక ఒక్కసారిగా భూకంపం వచ్చినట్లు భవనం కంపించింది. బాల్కనీలోకి వచ్చి చూస్తే అంతా దుమ్ముతో నిండిపోయింది. కిందకు దిగాక భవనం కూలిందని అర్థమైంది. అధికారుల కంటే ముందే మేం ఒకరిని శిథిలాల నుంచి బయటకు లాగాం" అని తెలిపారు. మరో ప్రత్యక్ష సాక్షి మాట్లాడుతూ, ఇంకా 20-30 మంది శిథిలాల కింద చిక్కుకొని ఉండవచ్చని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనతో స్థానికంగా భయాందోళనలు నెలకొన్నాయి.

# ప్రతిపక్ష హోదాను అపహాస్యం చేస్తున్న కేసీఆర్

**తక్షణం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయండి**

**: మహాధర్నాలో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ డిమాండ్**

**బీఆర్ ఎస్ పదేండ్ల పాలన.. కాంగ్రెస్ రెండున్నరేండ్ల పాలనపై చర్చకు సిద్ధమంటూ సవాల్**

**హాజరైన మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం, అజారుద్దీన్,**

**పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు**



**హైదరాబాద్ : (ప్రజావినికిడి):**
ప్రధాన ప్రతిపక్ష నేత హోదాలో అసెంబ్లీకి రాని బీఆర్ ఎస్ అధినేత కేసీఆర్ఁ ఆ హోదాను అపహాస్యం చేస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. ప్రభుత్వం నుంచి జీతం తీసుకుంటున్న ఆయన సభకు రాకపోవటం అత్యంత శోచనీయమని దుయ్యబట్టారు. ఈ నేపథ్యంలో తక్షణం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలంటూ ఆయన కేసీఆర్‌ను డిమాండ్ చేశారు. ఇదే అంశంపై కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు వి హనుమంతరావు సారధ్యంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహేశ్ కుమార్ గౌడ్‌తోపాటు మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్ రెడ్డి, మాజీ ఎంపీలు మధుయాష్కీ గౌడ్, అంజన్ కుమార్ యాదవ్, పలువురు ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ'పదేండ్ల పాలనలో బీఆర్ ఎస్ రాష్ట్రానికి ఏం ఒరగబెట్టిందో.. రెండున్నరేండ్లలో కాంగ్రెస్ ప్రజలకు ఎలాంటి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిందో చర్చించేందుకు మేం సిద్ధం.. మీరు సిద్ధమాఁ?' అని కేసీఆర్‌కు సవాల్ విసిరారు.
బీఆర్ ఎస్ పాలనతో విసిగిపోయిన రాష్ట్ర ప్రజలుఁ గత ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆశీర్వదించారని గుర్తు చేశారు. బీఆర్ఎస్‌కు ప్రతిపక్ష బాధ్యత ఇచ్చారని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షానిది కీలక పాత్ర అని చెప్పారు. కేసీఆర్‌కు ప్రతిపక్ష హోదా ఇస్తే ఆయన అసెంబ్లీకి రాకుండా ముఖం చాటేస్తున్నారని ఎద్దేవా చేశారు. అందుకే ఎమ్మెల్యే పదవికి ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీకి ఎందుకు రావడం లేదో చెప్పాలని కేసీఆర్ ను నిలదీశారు. అధికారం ప్రజలిచ్చే కానుకని, వారి ఆకాంక్షలు, ఆశయాలకు అనుగుణంగానే తమ ప్రజాపాలన కొనసాగుతోందని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్లు, సన్న బియ్యంతో పాటు అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని వివరించారు. ప్రజలకిచ్చిన మాటకు కట్టుబడి అనేక హామీలను అమలు చేస్తున్నామన్నారు. బీఆర్ఎస్ హయాంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లిస్తామని చెప్పి ముఖం చాటేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకు భిన్నంగా ఇండ్లు లేని వారికి ఇండ్లు కట్టించటమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నాయకులకు చదువుతో పాటు సంస్కారం అవసరమని హితవు పలికారు. పదేండ్ల కాలంలో విదేశీ పెట్టుబడులు ఏ మేరకు తెచ్చారో చెప్పాలని నిలదీశారు.
తాము రెండున్నరేండ్లలో రూ.లక్షా 78వేల కోట్లు విదేశీ పెట్టుబడులతోపాటు గ్లోబల్ సమ్మిట్‌తో రూ. ఐదు లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదుర్చుకున్నామని చెప్పారు. 70వేలకు పైగా ఉద్యోగాలను ఇచ్చామని, ఇంకో రెండున్నరేండ్లలో మరిన్ని ఉద్యోగాలు ఇచ్చితీరుతామని హామీనిచ్చారు. ఉద్యమకారులు గద్దర్, అందెశ్రీని కేసీఆర్ విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ తమ ప్రభుత్వం వారిని సముచితంగా గౌరవించిందని గుర్తు చేశారు. కుల సర్వేతో తెలంగాణ దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందని వివరించారు. బీజేపీ నేతలు తమ ప్రభుత్వం గురించి వ్యంగంగా మాట్లాడటం తప్ప వారు రాష్ట్రానికి చేసిందేమీ లేదని విమర్శించారు. కేసీఆర్‌ను కొడుకు కేటీఆర్, అల్లుడు హరీష్ రావు అసెంబ్లీకి రాకుండా అడ్డుకుంటున్నారా? అని ఎద్దేవా చేశారు. ఒకవేళ అల్లుడు, కొడుక్కి అవకాశం ఇవ్వాలనుకుంటే శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకోవాలని కేసీఆర్ కు సలహానిచ్చారు.
గత బీఆర్ఎస్ పాలనలో ధనిక రాష్ట్రమైన తెలంగాణ అప్పులపాలైందని వాపోయారు. ఆ ప్రభుత్వం రూ. ఎనిమిదిన్నర లక్షల కోట్ల అప్పులు చేసి వెళ్లిందని, ఈ క్రమంలో తాము ఓ వైపు కేసీఆర్ చేసిన అప్పులకు వడ్డీలు కడుతూనే మరోవైపు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. విద్యా, వైద్య రంగానికి ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. గతంలో కేసీఆర్ వైద్య రంగాన్ని పట్టించుకోలేదని విమర్శించారు. స్కిల్ యూనివర్శిటీతో యువతలో నైపుణ్యాభివృద్ధికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీ బిల్లును తొక్కిపెట్టి ఆయా తరగతుల నోటికాడి కూడును లాక్కుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం మెడలు వంచైనా సరేఁ బీసీల గణనను కులగణనలో చేర్పిస్తామని చెప్పారు.

# సాత్విక్-చిరాగ్ సంచలనం..

**మొదటిపేజీ తరువాయి**
హీ జి టింగ్, రెన్ జియాంగ్ యూపై 11-21, 21-13, 21-17 తేడాతో అద్భుత విజయం సాధించారు.గంటా 10 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో భారత జోడీ అద్భుతమైన పోరాట పటిమను ప్రదర్శించింది. తొలి గేమ్‌లో చైనా జోడీ తమ వేగం, తెలివైన షాట్లతో పూర్తి ఆధిపత్యం చెలాయించింది. దీంతో సాత్విక్-చిరాగ్ 11-21 తేడాతో సులభంగా గేమ్‌ను కోల్పోయారు. అయితే, రెండో గేమ్‌లో భారత ద్వయం అద్భుతంగా పుంజుకుంది. తమ అనుభవాన్ని రంగరించి, ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచి 21-13తో గేమ్‌ను గెలిచి మ్యాచ్‌ను నిర్ణయాత్మక మూడో గేమ్‌కు తీసుకెళ్లారు.
నిర్ణయాత్మక మూడో గేమ్ ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగింది. తొలుత చైనా జోడీ 4-0 ఆధిక్యంతో దూకుడుగా ప్రారంభించినా, సాత్విక్-చిరాగ్ ఏ దశలోనూ పట్టు వదల్లేదు. స్కోరు 17-17తో సమమైన కీలక దశలో భారత ద్వయం వరుసగా నాలుగు పాయింట్లు సాధించి 21-17తో గేమ్‌తో పాటు మ్యాచ్‌ను, టైటిల్‌ను సొంతం చేసుకుంది.
ఈ సీజన్‌లో సింగపూర్ ఓపెన్ తర్వాత సాత్విక్-చిరాగ్ జోడీకి ఇది రెండో టైటిల్ కావడం విశేషం. ఇటీవలి టోర్నీలలో నిరాశపరిచినప్పటికీ, ఈ విజయంతో వారు తిరిగి ఫామ్‌లోకి వచ్చారు. భుజం నొప్పితో సాత్విక్, వెన్ను నొప్పితో చిరాగ్ బాధపడుతున్నా... గాయాలను లెక్కచేయకుండా వారు ప్రదర్శించిన పోరాట పటిమ అభిమానులను ఆకట్టుకుంది.

## ఏపీ కాంగ్రెస్‌కు కొత్త ఇన్‌ఛార్జ్.. పీవీ మోహన్‌కు బాధ్యతలు

**మొదటిపేజీ తరువాయి**
చెందిన ఎమ్మెల్సీ పీవీ మోహన్‌ను నియమించింది. ఇప్పటివరకు ఈ బాధ్యతల్లో ఉన్న తమిళనాడు ఎంపీ మాణికం ఠాగూర్‌ను తప్పించి, ఆయన స్థానంలో మోహన్‌కు బాధ్యతలు అప్పగించింది.
ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ శనివారం రాత్రి ఈ నియామకాలకు సంబంధించిన అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఏఐసీసీ కార్యదర్శిగా ఉన్న పీవీ మోహన్, గతంలో కేరళ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జిగా పనిచేశారు. తాజా మార్పులతో పాటు మరికొన్ని రాష్ట్రాలకు కూడా కొత్త ఇన్‌ఛార్జ్‌లను నియమించారు.ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సీనియర్ నేత సిరివెళ్ల ప్రసాద్‌కు మహారాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగించడం ప్రాధాన్యత సంతరించుకుంది. అదేవిధంగా, రాజస్థాన్ సీనియర్ నేత సచిన్ పైలట్‌కు పంజాబ్ ఇన్‌ఛార్జ్‌గా, ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి భూపేష్ భగేల్‌కు అస్సాం ఇన్‌ఛార్జ్‌గా, రాజ్యసభ సభ్యుడు రణ్‌దీప్ సింగ్ సూర్జేవాలాకు గుజరాత్ ఇన్‌ఛార్జ్‌గా బాధ్యతలు కేటాయించారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసే దిశగా ఈ మార్పులు చేపట్టినట్లు తెలుస్తోంది.

# కొత్త పింఛన్లకు దరఖాస్తులు

**మొదటిపేజీ తరువాయి**
సోమవారం నుంచి ఈ నెల 16వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కేంద్రాల్లో కొత్తపింఛన్ల కోసం దరఖాస్తులను స్వీకరించనున్నారు.
రూ. 4,000 పింఛన్.. కొత్త అర్హులకు గొప్ప అవకాశం
రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే దాదాపు 62 లక్షల మందికి పైగా లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా కింద పెంచిన పింఛన్లను ప్రభుత్వం క్రమం తప్పకుండా అందిస్తోంది. అయితే, వివిధ కారణాల వల్ల ఇప్పటివరకు పింఛను అందుకోలేకపోయిన పేదలకు, నూతనంగా అర్హత సాధించిన వారికి కూడా లబ్ధి చేకూర్చాలనే ఉద్దేశంతో నూతన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ప్రారంభించింది.

**నూతన పింఛన్ల ప్రక్రియ - పూర్తి షెడ్యూల్**
సెప్టెంబర్ 7 16: నూతన పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణ.
సెప్టెంబర్ 17 21: జనరల్ వెరిఫికేషన్ (సాధారణ పరిశీలన).
సెప్టెంబర్ 22 24: ఫిజికల్, శాఖాపరమైన ధ్రువీకరణ, అర్హతల నిర్ణయం.
సెప్టెంబర్ 25 26: 'సెర్ప్' ద్వారా బడ్జెట్ ప్రతిపాదనలు, ప్రభుత్వ ఆమోద ప్రక్రియ.
దరఖాస్తు కేంద్రాలు: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 'స్వర్ణ గ్రామం - స్వర్ణ వార్డు' (గ్రామ/వార్డు సచివాలయ) కేంద్రాల్లో దరఖాస్తులను స్వీకరిస్తారు.దరఖాస్తుదారులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు గాను స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కేంద్రాల వద్ద ముందస్తుగా ప్రత్యేక కౌంటర్లు, సదుపాయాలు ఏర్పాటు చేశారు. అర్హులైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర చేనేత, గీత కార్మికులు, ఒంటరి మహిళలు అవసరమైన పత్రాలతో సమీప సచివాలయానికి వెళ్ళి తమ దరఖాస్తులను అందజేయాలని అధికారులు సూచించారు. అందిన దరఖాస్తులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ త్వరితగతిన నూతన పింఛన్లు మంజూరు చేయనున్నారు.

# 8 హైకోర్టులకు కొత్త చీఫ్ జస్టిస్‌లు..

**మొదటిపేజీ తరువాయి**
జారీ చేసింది. ఈ నియామకాల వివరాలను కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. కొలీజియం సిఫార్సు చేసిన కొద్ది రోజులకే కేంద్రం వేగంగా స్పందించి ఈ నియామక ప్రక్రియను పూర్తి చేయడం గమనార్హం.
నియామకాల వివరాల్లోకి వెళితే.. ఢిల్లీ హైకోర్టులో న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ వల్లూరి కామేశ్వరరావును పాట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించారు. అదేవిధంగా బాంబే హైకోర్టుకు చెందిన జస్టిస్ రవీంద్ర వి. ఘుగే కలకత్తా హైకోర్టుకు నేతృత్వం వహించనున్నారు. ఛత్తీస్‌గఢ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కుమార్ అగర్వాల్‌ను రాజస్థాన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించారు. అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మహేష్ చంద్ర త్రిపాఠి బాంబే హైకోర్టు కొత్త సీజేగా బాధ్యతలు చేపట్టనున్నారు.

# మూడేళ్లలో డ్రగ్స్ రహిత భారత్

**మొదటిపేజీ తరువాయి**
అరికట్టామో, అదే పద్ధతిలో మాదకద్ర వ్యాల ముప్పును కూడా పూర్తిగా తుడిచిపెడతా మని ధీమా వ్యక్తం చేశారు. 2014కు ముందు మాదకద్రవ్యాలపైపోరాటం చిన్న చిన్న విభాగాల్లో, ఒంటరిగా సాగేదని, ఏజెన్సీలు చిన్న నిందితులను పట్టుకోవడంతోనే సరిపెట్టుకునేవని అమిత్ షా గుర్తు చేశారు. డ్రగ్స్పై ఈ పోరాటాన్నిజాతీయ భద్రతా ప్రాధాన్యతగా మోడీ ప్రభుత్వంమార్చిందని చెప్పారు.
నాలుగు స్థాయిల్లోనార్కో సమన్వయ కేంద్రాలు2019లో నాలుగు స్థాయిల నార్కో సమన్వయ కేంద్రం ఏర్పాటు చేశారు. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోప్రత్యేక మాదకద్రవ్య నిరోధక టాస్క్ ఫోర్స్ ను ఏర్పాటుచేశారు. మాదకద్రవ్య నియంత్రణ బ్యూరోను పునర్వ్యవస్థీకరించి బలోపేతం చేశారు. నిడాన్ పోర్టల్ ద్వారా నేరస్తులజాతీయ డేటాబేస్ సృష్టించారు. 1933 మానస్ హెల్ప్ లైన్‌ప్రారంభించి బాధిత యువతకు పునరావాసం అందిస్తున్నట్టు కేంద్ర మంత్రి చెప్పారు.
కార్యాచరణ ప్రణాళిక నాలుగు స్తంభాలపై ఆధారపడిఉంది. మేధస్సు, కార్యాచరణ ఆధారిత అమలు, సింథటిక్‌మాదకద్రవ్యాలు, పూర్వగామి రసాయనాల నియంత్రణ,డిమాండ్ తగ్గింపు, హాని తగ్గింపు, సామర్థ్య నిర్మాణం, సమన్వయం. దిగువ నుంచి పైకి, పై నుంచి కిందికి దర్యాప్తు విధానం అవలంబిస్తున్నారని అమిత్ షా తెలిపారు. చిన్న ప్యాకెట్‌స్వాధీనం చేసుకున్నా మొత్తం నెట్వర్క్ న్ను వెలికితీస్తారు.సరిహద్దుల్లో పెద్ద సరుకు పట్టుకున్నా వినియోగదారువరకు జాడ వెతుకుతారని కేంద్ర మంత్రి చెప్పారు.

## హైదరాబాద్‌లో ట్రాన్స్‌జెండర్ల ఆగడాలపై డీజీపీ సీవీ ఆనంద్ సీరియస్

**మొదటిపేజీ తరువాయి**
స్పష్టం చేశారు. ఇటీవల హైదరాబాద్‌లోని చింతల్‌లో ఓ గృహప్రవేశ వేడుకలో ట్రాన్స్‌జెండర్లు రూ. 50,000 డిమాండ్ చేసిన ఘటన సోషల్ మీడియాలో వైరల్ అయిన నేపథ్యంలో డీజీపీ ఈ ప్రకటన చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.సెప్టెంబర్ 4న చింతల్ ప్రాంతంలో ఓ కుటుంబం తమ నూతన గృహంలోకి ప్రవేశించేందుకు రాగా, కొందరు ట్రాన్స్‌జెండర్లు వారిని అడ్డుకున్నారు. ఇంట్లోకి వెళ్లాలంటే రూ. 50,000 ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. అంత మొత్తం ఇచ్చుకోలేమని బాధితులు చెప్పినా వినకుండా అసభ్యంగా ప్రవర్తించి, శాపనార్థాలు పెట్టారని బాధితురాలు వీడియో ద్వారా ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వ్యాపించడంతో, ఇలాంటి వసూళ్ల దందాలపై కఠిన చర్యలు తీసుకోవాలని నెటిజన్లు పోలీసులను కోరారు.ఈ ఘటనపై స్పందించిన డీజీపీ సీవీ ఆనంద్, ఇటీవల కాలంలో ఇలాంటి ఫిర్యాదులు తన దృష్టికి వస్తున్నాయని అంగీకరించారు. తాను హైదరాబాద్ సీపీగా ఉన్నప్పుడు కూడా ఇలాంటి బెగ్గింగ్ రాకెట్లు, బలవంతపు వసూళ్లపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి నియంత్రించినట్లు గుర్తుచేశారు. ఇప్పుడు మళ్లీ అదే తరహా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.అదే సమయంలో, ట్రాన్స్‌జెండర్ల జీవనోపాధికి తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని డీజీపీ ప్రస్తావించారు. ప్రభుత్వ చొరవతో ఎందరో ట్రాన్స్‌జెండర్లు ట్రాఫిక్ అసిస్టెంట్లుగా, ఇతర విభాగాల్లో ఉద్యోగాలు పొంది ఎలాంటి ఫిర్యాదులు లేకుండా మంచి పేరు తెచ్చుకుంటున్నారని ఆయన వివరించారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
సోమవారం 7 సెప్టెంబర్ 2026

# అంగరంగ వైభవంగా మీర్ఖాన్ పేట గ్రామంలో శ్రీ పోచమ్మ బోనాల సందడి





**హయత్ నగర్,(ప్రజావినికిడి):** పోచమ్మ అమ్మవారి దయతో మా ఊరు చల్లగా ఉండాలి తెలిపిన తెలంగాణ ఉద్యమకారుడు కాకి నరసింహ ముదిరాజ్ మీర్ఖాన్ పేట గ్రామంలో అంగరంగ వైభవంగా శ్రీ పోచమ్మ తల్లి బోనాల మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుడు కాకి నరసింహ ముదిరాజ్ పాల్గొన్నారు.శ్రీ పోచమ్మ తల్లి దయతో గ్రామ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నానని ప్రతి ఒక్క రైతు వానలు కురవాలని సుఖ సంతోషాలతో ఉండాలని శ్రీ పోచమ్మ తల్లిని మా మీద దీవెనలు ఉంచాలని అన్నారుద

## సహభావన ఏ బ్లాక్‌లో నూతన ఓపెన్ జిమ్ ప్రారంభం..



**నాగోల్,(ప్రజావినికిడి):**నాగోల్ డివిజన్ పరిధిలోని సహభావన ఏ బ్లాక్‌లో నూతనంగా నిర్మించిన ఓపెన్ జిమ్‌ను ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని కాలనీలలో అవసరమైన మౌలిక వసతులతో పాటు వ్యాయామ సదుపాయాలను కూడా అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు. ఓపెన్ జిమ్‌ను కాలనీవాసులు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ చెరుకు సంగీత ప్రశాంత్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు తూర్పాటి చిరంజీవి, విశ్వేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## భక్తి భావంతో వినాయక చవితి వేడుకలు నిర్వహించాలి

### షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ -షాద్‌నగర్‌లో ఘనంగా గణేశుడి ఆగమనం





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**వినాయక చవితి వేడుకలకు షాద్‌నగర్ పట్టణంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుందివివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం గణేశుడి ఆగమనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, వినాయక చవితి సందర్భంగా పట్టణంలో యువత ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున గణేశుడి ఆగమనం కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. యువత ఆధ్యాత్మిక చింతనతో ఎలాంటి అసాంఘిక ధోరణులకు తావులేకుండా భక్తి భావంతో వినాయక చవితి, నవరాత్రి ఉత్సవాలను నిర్వహించాలని సూచించారు.గణేశ్ ఉత్సవాలను ప్రజలందరూ ఆనందంగా, ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే శంకర్ కోరారు. ఉత్సవాలకు ప్రభుత్వ శాఖల సంబంధిత అధికారుల సహకారం అందిస్తామని తెలిపారు. భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలని ఎమ్మెల్యే శంకర్, మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్,వైస్ చైర్మన్ అందే మోహన్ తదితరులు సూచించారు.గణేశుడి ఆగమనం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకుడు సాయి ప్రకాష్ రెడ్డిని ఎమ్మెల్యే శంకర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సభ్యులు పెంటయ్య, మురళి మోహన్ (అప్పి),బచ్చలి నరేష్,ప్రవీణ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్‌తో పాటు వివేకానంద సేవా సమితి సభ్యులు, యువత,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దశ 10 పుడ్ పార్క్ హోటల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి



**షాద్ నగర్,(ప్రజావినికిడి):** షాద్ నగర్ పట్టణంలోని మహబూబ్నగర్ రోడ్డులో భార్గవ్ కుమార్ రెడ్డి ఏర్పాటు చేసిన దశ 10 పుడ్ పార్క్ హోటల్ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి హాజరై యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ, వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా, సరికొత్త రుచులతో, నాణ్యమైన వంటకాలతో ఈ హోటల్ ప్రజల ఆదరణ పొందాలని ఆకాంక్షించారు.వ్యాపార రంగంలో సరికొత్త ప్రమాణాలు నెలకొల్పుతూ, ఈ సంస్థ ప్రస్థానం విజయవంతంగా సాగాలని, యాజమాన్యానికి మంచి లాభాలు రావాలని ఆయన మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వాణీ పాండురంగ రెడ్డి,గౌస్ జానీ,పోమాల్ పల్లి సర్పంచ్ స్వప్న భూపాల్ రెడ్డి,మాజీ కౌన్సిలర్లు కానుగు అనంతయ్య,చింటూ ప్రతాప్ రెడ్డి,యుగేందర్,చెట్ల నరసింహ,శ్రీనివాస్ గౌడ్,చిన్న యాదగిరి, చెన్నయ్య,కంటెస్టెడ్ కౌన్సిలర్ నక్కల వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అట్టడుగు వర్గాలకు న్యాయం జరగాలంటే దండోరా ఉద్యమం కొనసాగాలి





## రాగల్ల ఉపేందర్ మాదిగ



**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):** అట్టడుగు వర్గాలకు న్యాయం జరగాలంటే దండోరా ఉద్యమం కొనసాగాలని ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఇంచార్జి రాగల్ల ఉపేందర్ మాదిగ అన్నారు. ఆదివారం కొత్తపేట కమ్యూనిటీ హాల్‌లో ఎమ్ఎస్పి సీనియర్ నాయకులు బత్తిని సుధాకర్ మాదిగ అధ్యక్షతన ఎమ్మార్పీఎస్, ఎమ్ఎస్పి అనుబంధ విభాగాల సరూర్‌నగర్, హయత్‌నగర్ మండలాల నూతన కమిటీల ఎన్నికల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇంచార్జి కొమ్ము రాజశేఖర్ మాదిగ స్వాగత ఉపన్యాసం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఇంచార్జి రాగల్ల ఉపేందర్ మాదిగ మాట్లాడుతూ సమాజంలో నెలకొన్న సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలను రూపుమాపి సమానత్వాన్ని సాధించడమే ఎమ్మార్పీఎస్ ప్రధాన ఆశయమని, అట్టడుగు వర్గాలకు న్యాయం లభించాలంటే దండోరా ఉద్యమం మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని అన్నారు. ఎమ్ఎస్పి సీనియర్ నాయకులు బత్తిని సుధాకర్ మాదిగ అధ్యక్షతన పీడిత, అణగారిన వర్గాల గొంతుకగా ఎమ్మార్పీఎస్ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతోందన్నారు.ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్ధత సాధన కోసం ప్రారంభమైన ఉద్యమం తన పరిధిని విస్తరించుకొని అనేక సామాజిక సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేసిందని తెలిపారు. ఎమ్మార్పీఎస్ పోరాటాల ఫలితంగానే ఎస్సీ,ఎస్టీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు, ఆరోగ్యశ్రీ,ఆసరా పెన్షన్లు,మనిషికి ఆరు కిలోల బియ్యం వంటి సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అందుతున్నాయని ఆయన పేర్కొన్నారు. అణగారిన వర్గాలకు అన్ని రంగాల్లో న్యాయం జరగాలంటే ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అస్తిత్వం, ఆత్మగౌరవం, హక్కుల సాధన కోసం సాగుతున్న ఉద్యమంలో చదువుకున్న యువత పెద్ద సంఖ్యలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. యువతరం ఉద్యమంలోకి వచ్చి సమాజ హితం కోసం పనిచేయాలని కోరారు. మందకృష్ణ మాదిగ నాయకత్వంలో గత 32 ఏళ్లుగా దండోరా ఉద్యమం లక్షలాది మందిని కదిలించే బలమైన సామాజిక ఉద్యమంగా కొనసాగుతోందని అన్నారు. దేశంలో అనేక కుల ఉద్యమాలు పుట్టుకొచ్చినా లక్ష్య సాధన వరకు కొనసాగలేకపోయాయని, అయితే ఎమ్మార్పీఎస్ మాత్రం సజీవంగా నిలిచి తన లక్ష్య సాధన దిశగా ముందుకు సాగుతోందన్నారుప్రస్తుతం ప్రజా సమస్యలను గుర్తించి బలమైన ప్రజా పోరాటాలను నిర్మిస్తూ,దోపిడీ, వివక్ష,పీడన, అసమానతలు లేని నూతన సమాజ నిర్మాణం కోసం ఉద్యమం కొనసాగుతోందని తెలిపారు.అనంతరం సరూర్‌నగర్, హయత్‌నగర్ మండలాలకు ఎమ్మార్పీఎస్, ఎమ్ఎస్పి నూతన కమిటీలను ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ సరూర్‌నగర్ మండల కమిటీ అధ్యక్షులుగా ఆగుపోగు సునీల్ కుమార్ మాదిగ,అధికార ప్రతినిధిగా సూరిగిరి బీషన్న మాదిగ,ప్రధాన కార్యదర్శిగా ధర్మారపు సైదులు మాదిగ, ఉపాధ్యక్షులుగా కమ్మలపల్లి శ్రీధర్, గడామూరు సుమన్,కోశాధికారిగా పల్లెర్ల నాగరాజు, ఎమ్ఎస్పి సరూర్‌నగర్ మండల కమిటీఅధ్యక్షులుగా గండికోట భీమారాజు వడ్డెర,
అధికార ప్రతినిధిగా దేరంగుల క్రాంతి కుమార్,మాదిగ ప్రధాన కార్యదర్శిగా ఆకుపోగు మౌలాలి,మాదిగ యాచారం లక్ష్మి నర్సయ్య, మాదిగఉపాధ్యక్షులుగా గోవి శివ,కోశాధికారిగా మంద నర్సింహా,కార్యదర్శిగా రేపల్లె లోకేష్, ఎమ్మార్పీఎస్ హయత్‌నగర్ మండల కమిటీఅధ్యక్షులుగా కొమ్ము శివ మాదిగ,
అధికార ప్రతినిధిగా కొంగరి జానకి రామ్ మాదిగ,ప్రధాన కార్యదర్శులుగా ఇరుగు వినయ్ కుమార్ మాదిగ, ఇరుగు లింగరాజు మాదిగ, ఉపాధ్యక్షులుగా కొమ్ము మల్లేష్ మాదిగ,దుబ్బాక సతీష్ మాదిగ, ఎమ్ఎస్పి హయత్‌నగర్ మండల కమిటీ అధ్యక్షులుగా కొంగరి నవీన్ మాదిగ,అధికార ప్రతినిధిగా ఇరుగు సుధాకార్ మాదిగ,ప్రధాన కార్యదర్శిగా ఇరుగు సురేష్ మాదిగ, ఉపాధ్యక్షులుగా జొన్నం ఆదమ్ మాదిగ,ఇరుగు సుధాకర్ మాదిగ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎమ్ఎస్పి ఎల్బీనగర్ నియోజకవర్గం ఇంచార్జి యర్ర రవీందర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ కో-ఇంచార్జి సతీష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ మాజీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి డి.ప్రకాష్ మాదిగ, ఎమ్ఎస్పి సీనియర్ నాయకులు హేమంత్ గుప్తా, చంపాపేట డివిజన్ నాయకులు ఎమ్ఎస్పి డివిజన్ ఇంచార్జి మల్లెపోగు రాజు మాదిగ ఎమ్మెస్పి సీనియర్ నాయకుడు నర్సింగ్ రావు మాదిగ నరసింహ మాదిగ మంద నరసింహ (దేవ) మాదిగ రవి మాదిగ చిరంజీవి మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# నాగోల్ సర్కిల్‌లో అక్రమ నిర్మాణాల దందా..

**అనుమతులు ఒకలా.. నిర్మాణాలు మరోలా.. -టౌన్‌ప్లానింగ్ అధికారుల కనుసైగలోనే అక్రమాల జోరు.?**




**నాగోల్, (ప్రజావినికిడి):** నాగోల్ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాల వ్యవహారం రోజురోజుకూ ముదురుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.జీహెచ్ఎంసీ నుంచి తీసుకున్న అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నప్పటికీ టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అనుమతులు ఒక విధంగా తీసుకుని, క్షేత్రస్థాయిలో మరో విధంగా నిర్మాణాలు చేపడుతున్నా నాగోల్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది, అధికారులు చర్యలు లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

### ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి

అనుమతులకు మించి అదనపు అంతస్తులు, నిబంధనలకు విరుద్ధమైన నిర్మాణాలు వెలుస్తుండటంతో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి లక్షల రూపాయల్లో గండి పడుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. బిల్డింగ్ పర్మిషన్, డెవలప్‌మెంట్ ఛార్జీలు,ఇతర రుసుముల రూపంలో రావాల్సిన ఆదాయం అక్రమ నిర్మాణాల కారణంగా కోల్పోతున్న పరిస్థితి నెలకొందని చెబుతున్నారు.

### కోర్టులో కేసులు ఉన్నా.. నిర్మాణాలు మాత్రం జోరుగా

కొన్ని నిర్మాణాలకు సంబంధించి కోర్టుల్లో రిట్ పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నప్పటికీ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. న్యాయస్థానాల పరిధిలో ఉన్న అంశాల్లో కూడా నిర్మాణాలు పూర్తయ్యే వరకు అధికారులు ఎందుకు అడ్డుకోలేకపోతున్నారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.హైకోర్టు ఆదేశాలను అమలు చేయాల్సిన అధికారులు మౌనం వహిస్తే అక్రమ నిర్మాణదారులకు మరింత ధైర్యం వస్తుందనే విమర్శలు ఉన్నాయి.నాగోల్ సర్కిల్ పరిధిలోని ప్లాట్ నెంబర్:178, ఇంటి నెంబర్:3-12-89 వద్ద నిర్మాణంపై కూడా అనుమతులు మించి అక్రమ అంతస్తులు ఉన్నాయని అధికారులపై అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, మంజూరైన ప్లాన్‌కు అనుగుణంగానే నిర్మాణం జరుగుతోందా లేదా అనే విషయాన్ని బహిర్గతం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

### రెండు అనుమతులు.. ఒకే భవనం.. నాలుగు అంతస్తులు..

సెంట్రల్ బ్యాంక్ కాలనీలో మరింత ఆసక్తికరమైన వ్యవహారం వెలుగులోకి వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. పక్కింటి నెంబర్ 3982 రెండు వేర్వేరు అనుమతులు తీసుకుని ఒకే భవనంగా నాలుగు అంతస్తుల నిర్మాణం చేపట్టారనే ఆరోపణలు ఉన్నాయి.రెండు అనుమతుల ఆధారంగా ఒకే భవనాన్ని ఏ విధంగా నిర్మించారు.? మంజూరైన ప్లాన్‌లో ఎన్ని అంతస్తులకు అనుమతి ఉంది.? వాస్తవంగా ఎన్ని అంతస్తులు నిర్మించారు.? అనే అంశాలపై అధికారులు సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

### అక్రమ నిర్మాణాలు చేసుకోండి మేము మౌనంగా ఉంటాం

నాగోల్ సర్కిల్ పరిధిలోఅక్రమ నిర్మాణాలు ప్రారంభ దశలోనే గుర్తించి నిలిపివేయాల్సిన టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు నిర్మాణాలు పూర్తయ్యే వరకు వేచి చూస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిర్మాణం పూర్తయిన తర్వాత నోటీసులు ఇచ్చినా, కూల్చివేత చర్యలు తీసుకోకపోతే వాటి ప్రయోజనం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

### అధికారులపై ఏసీబీ అధికారులచే విచారణ జరపాలని

నాగోల్ సర్కిల్ పరిధిలో అనుమతులు, మంజూరైన ప్లాన్లు,వాస్తవ నిర్మాణాలను సమగ్రంగా పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా కోర్టు కేసులు,హైకోర్టు ఆదేశాలు ఉన్న నిర్మాణాలపై ఇప్పటివరకు తీసుకున్న చర్యలపై ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు.

### జోనల్ కమిషనర్ దృష్టి సారించాలి

నాగోల్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ విభాగంలో అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్నారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ స్థాయి అధికారులు విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని ప్రజలు కోరుతున్నారు. తప్పు చేసిన అధికారులు ఎవరైనా ఉంటే శాఖాపరమైన చర్యలతో పాటు నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.
అనుమతులు కాగితాలకే పరిమితం చేసి.. క్షేత్రస్థాయిలో ఇష్టారాజ్యంగా నిర్మాణాలు సాగితే నగర ప్రణాళిక వ్యవస్థకే అర్థం లేకుండా పోతుంది. నాగోల్ సర్కిల్‌లో అక్రమ నిర్మాణాలపై ఉన్నతాధికారులు ఇప్పటికైనా కొరడా ఝుళిపిస్తారా.? లేక అక్రమ నిర్మాణాలకు మరింత అవకాశం ఇస్తారా.? అనేది వేచి చూడాలి.



# లక్ష్మీదేవిపల్లి పై ప్రశ్నిస్తే బెదిరింపులు సరికాదు..!

**ముందు సమాధానాలు వెతకండి!**

**ప్రజా సమస్యల పై ప్రశ్నిస్తే ప్రతిఫలంగా మూల్యం చెల్లించుకోవాల్సి వస్తే దానికి మేము సిద్ధమే..**

**షాద్ నగర్ ప్రజా సంఘాల నాయకులు..**



**షాద్ నగర్,(ప్రజావినికిడి):** లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పై ప్రజా సంఘాలుగా ప్రజల పక్షాన మాకు ఉన్న అనుమానాలను ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడటం సరైంది కాదని, ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే ప్రతిఫలంగా మూల్యం చెల్లించుకోవాల్సి వస్తే దానికి మేము సిద్ధంగా ఉన్నామని ప్రజా సంఘాల నాయకులు తిరుమలయ్య, పినపాక ప్రభాకర్, టీజీ.శ్రీనివాస్, రవీంద్రనాథ్, బి.సత్యం , అర్జునప్ప, ప్రశాంత్,శ్రీకాంత్, ఆకాష్ నాయక్, సత్యనారాయణలు మీడియాకు తెలిపారు.

ఈ సందర్భంగా షాద్ నగర్ లో ఓ జరిగిన సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ, లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ భూసేకరణకు నోటిఫికేషన్ వెలువడిన సందర్భంలో ప్రజా సంఘాలుగా మేము ప్రాజెక్ట్ యొక్క డిపిఆర్ ను బయట పెట్టాలని,ఈ రిజర్వాయర్ ద్వారా రైతాంగానికి , పరిశ్రమలకు ఎంత నీరు కేటాయిస్తారు అనే విషయం ప్రభుత్వం చెప్పాలి అని డిమాండ్ చేసాము.అదే విధంగా సాగు నీరు, త్రాగు నీరు అందించటం ప్రాజెక్టుల యొక్క ముఖ్య ఉద్దేశం . అందువల్ల మేము రైతాంగానికి మొత్తం ఎన్ని ఎకరాలకు ఏయే నియోజకవర్గాలలో,ఏయే మండలాలలో నీరు అందిస్తారు అనేది ప్రజలకు తెలపాలని కోరడం జరిగింది. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం మొదట డిజైన్ జూరాల నుండి నీటిని ఎత్తిపోయాలని ప్రతిపాదిత దశలో లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ సామర్థ్యం 10 టీఎంసీ లుగా ఉంది. కానీ గత ప్రభుత్వం డిజైన్ ను మార్చిన తరువాత రిజర్వాయర్ సామర్థ్యాన్ని 2.8 టీఎంసీ లుగా ప్రదీపాదన చేశారు.దీని ద్వారా 4 లక్షల 13 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని ప్రతిపాదనలు చేశారు.గత ప్రభుత్వం ఈ రిజర్వాయర్ ను విస్మరించిన సందర్భంగా ఇప్పుడు తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రిజర్వాయర్ ను మొదలు పెడుతున్న తరుణంలో ఈ రిజర్వాయర్ కింద సాగు నీరు ఎన్ని ఎకరాలకు ఆయకట్టు ఉన్నదో చెప్పాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం పై ఉంది.గత మూడు దశాబ్దాలుగా పాలమూరు రంగారెడ్డి జిల్లాలకు సాగునీరు, త్రాగునీరు అందించాలని ప్రజా సంఘాలు ప్రజలు పోరాడుతూనే ఉన్నారు.అన్ని రాజకీయ పార్టీలు పాలమూరుకు అన్యాయమే చేశాయి.ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో కూడా పాలమూరుకు అన్యాయమే జరిగింది. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి ప్రాధాన్యత ఇవ్వకుండా మరో సారి పాలమూరుకు అన్యాయం చేసే విధంగా డిండి ఎత్తిపోతల పథకం పేరుతో పాలమూరు రంగారెడ్డి కి రావాల్సిన నీటిని నల్గొండకు తరలిస్తున్నారు. ఈ పనులు శరవేగంగా జరుగుతున్నాయిపాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ నుండే నల్గొండకు నీటిని తరలిస్తే లక్ష్మీదేవిపల్లి కి చుక్క నీరు కోడా వచ్చే అవకాశం లేదు.కాబట్టి డిండి లిఫ్టును అడ్డుకోవాలని చెప్పటం జరిగింది. అంతేకాకుండా ఈ ప్రాంతంలో పర్యావరణ విధ్వంసం చేసే డేటా సెంటర్ల నిర్మాణం కూడా శరవేగంగా జరుగుతున్నాయిడేటా సెంటర్ల నిర్వాహణకు సర్వర్లను చల్లబర్చటానికి విపరీతమైన నీటిని వినియోగించాల్సిన అవసరం ఉంటుంది. కాబట్టి ఇవన్నీ అంశాలు దృష్టిలో ఉంచుకొని లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ యొక్క డిపిఆర్ ను బయట పెట్టాలని డిమాండ్ చేయటం జరిగింది.మేము లేవనెత్తిన అంశాలపై సమాధానాలు ఇవ్వకుండా బెదిరింపులకు పాల్పడటం అనేది నియంతృత్వ పాలనకు నిదర్శనం.షాద్ నగర్ నియోజక వర్గంలో అధికార పార్టీ ప్రజల నుండి , ప్రజాసంఘాల నుండి వచ్చే నిరసనలను అంగీకరించే స్థితిలో లేదు. నిరసనలు తెలపడం అనేది ప్రజాస్వామిక హక్కు , ప్రభుత్వాలు ప్రజాస్వామ్య బద్ధంగా పరిపాలన చేయాలి కానీ అందుకు విరుద్ధంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం ద్వారా బెదిరింపులు, అక్రమ కేసులు నమోదు చేయడం,ప్రజల నిరసనలను అదుపులోకి తీసుకురావాలని నియంతృత్వ విధానంతో పనిచేస్తుంది. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలు నియంతృత్వ పాలనా విధానాన్నీ ఎంచుకోవడం దురదృష్టకరం. ఈ మధ్య కాలంలో షాద్ నగర్ లో ప్రతి పక్షాలు,ప్రజా సంఘాలు, ఇతర సంఘాలు ప్రభుత్వాలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న ప్రతీ సందర్భంలో బెదిరింపుల విధానాన్ని ఎంచుకోవడం హేయమైన చర్యగా భావిస్తున్నాం. ప్రజా స్వామ్యం ఫరిడవిల్లాలంటే ప్రజల యొక్క అసంతృప్తులకు చోటు కల్పించాలి.అలా కాకుండా అణిచివేతా విధానాలను ఎంచుకోవడం ప్రజాస్వామ స్ఫూర్తికి విరుద్ధం. ఈ ఈ విధానాలను తీవ్రంగా ఖండిస్తున్నాము. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీలతో పాటు ఏడవ గ్యారంటీగా "ప్రజాస్వామ్య పునరుద్ధరణ" ను ప్రకటించారు. కానీ అందుకు భిన్నంగా రాష్ట్రంలో ఇక్కడ పాలన కొనసాగుతుంది. ప్రజల సమస్యలను పాలకుల దృష్టికి తీసుకువస్తున్న ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు తగినమూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని ఇక్కడి కాంగ్రెస్ నాయకులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తే అందుకు ప్రతిఫలంగా మూల్యం చెల్లించుకోవాల్సి వస్తే అందుకు మేము సిద్ధంగానే ఉంటాము. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం షాద్ నగర్ లో ప్రజాస్వామ్య బద్దంగా పరిపాలన చేయాలని, ప్రజలు,ప్రజా సంఘాలు లేవనెత్తున్న ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలని తెలియజేస్తున్నాం.మీ బెదిరింపులు, అక్రమ కేసుల వల్ల మా కార్యాచరణను నియంత్రించాలని అనుకోవడం సరైంది కాదు. ఇకనైనా లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ డిపిఆర్ బయట పెట్టాలని, డిండి లిఫ్ట్ ను వ్యతిరేకించాలని, డేటా సెంటర్లకు నీరు ఎక్కడనుండి ఇస్తారో చెప్పాలి. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ ద్వారా ఎన్ని లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తారో తెలియజేయాలని డిమాండ్ చేస్తున్నాము. లేని పక్షంలో ప్రజల ఆగ్రహానికి గురికాజ తపదని తెలియజేస్తున్నాము.ఈ కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి తిరుమలయ్య, కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్, తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కోశాధికారి టీజీ శ్రీనివాస్, తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు అర్జునప్ప, పాలమూరు అధ్యయన వేదిక జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్, పాలమూరు ప్రాజెక్టుల సాధన కమిటీ చైర్మన్ సత్యనారాయణ, బీసీ యువజన సంఘం నేత పసుపుల ప్రశాంత్, ఎస్ఎఫ్ఐ నేత శ్రీకాంత్, ఏఐఎస్ఎఫ్ నేత ఆకాష్ నాయకు లు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వ్యాఖ్యలపై మండిపడ్డ మాజీ ఎమ్మెల్యే అంజయ్య..

**తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన గొప్ప నేత గురించా మీరు మాట్లాడేది.?**

**స్థాయికి మించిన మాటలు మాట్లాడడం రాజకీయ నాయకుడి లక్షణం కాదు**

**గత పదేళ్ల కాలంలో రాష్ట్రాన్ని దేశంలో నెంబర్ వన్ చేసిన ఘనత కేసీఆర్ ది**

**ఎవరు రాజీనామా చేయాలో ప్రజలు చెబుతున్న విషయాన్ని గుర్తిస్తలేరా ?**

**ఫామ్ హౌస్ నుంచి కేటీఆర్, హరీష్ రావు అనే రెండు కుక్కలను వదిలారని సంబోధించడం సిగ్గుచేటు**

**ఇచ్చిన హామీలు,ఆరు గ్యారంటీల అమలు విషయాన్ని పక్కనపెట్టి సిగ్గుపడే విమర్శలు చేయడం మీకే దక్కింది**

**కులం పేరుతో కేసీఆర్ పై ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేయడం సరికాదు**

**ఇందిరా పార్క్ కాంగ్రెస్ ధర్నాలో షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో మండిపడ్డ మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్..**

**కేసీఆర్, కేటీఆర్,హరీష్ రావులపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని వెల్లడి..**



**షాద్ నగర్,(ప్రజావినికిడి):** తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంతోపాటు పదేళ్లపాటు రాష్ట్రాన్ని అని రంగాలలో అభివృద్ధి చేసి దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా నిలిపిన కేసీఆర్ ను విమర్శించే స్థాయి మీకు ఉందా? అని మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ కాంగ్రెస్ నేతలకు చురకలాంటించారు. హైదరాబాదులోని ఇందిరా పార్క్ వద్ద కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన ధర్నాలో షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్,మాజీ మంత్రులు కేటీఆర్,హరీష్ రావులపై చేసిన ఆరోపణలు, విమర్శలపైన ఆయన స్పందించారు. కేసీఆర్,కేటీఆర్, హరీష్ రావు లపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని వివరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో మాట్లాడే హక్కు అందరికీ ఉంటుందని, స్థాయిని మరిచి మాట్లాడడం, విమర్శలు చేయడం ఓ రాజకీయ నాయకుడి లక్షణం కాదని అభిప్రాయపడ్డారు.ప్రతిపక్ష నేత కేసిఆర్ అసెంబ్లీకి రాకుంటే రాజ్యాంగపరమైన చర్యలు తీసుకునే వెసులుబాటు ఉందని,ఆ విధంగా చర్యలు తీసుకునే అవకాశం ప్రభుత్వాలకు ఉంటాయని గుర్తు చేశారు. ఇలాంటి అవగాహన లేకుండా,నోటికి ఎంత వస్తే అంత మాట్లాడి, రాజకీయ విలువలను నీరుగార్చడం సిగ్గుచేటు అన్నారు. గతంలో పనిచేసిన ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు, నారా చంద్రబాబు నాయుడు, పక్క రాష్ట్ర ప్రతిపక్ష నేత వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి లు సైతం చాలా కాలాలపాటు అసెంబ్లీకి రాలేదని విషయాన్ని గుర్తు చేశారు.ఏ విమర్శలు అయినా పార్టీల నేతలు, ప్రజలు స్వాగతించే విధంగా ఉండాలే తప్ప దిగజారుడు రాజకీయాలకు అద్దం పట్టే విధంగా ఉంటుందని చురకలాంటించారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను,ఆరు గ్యారంటీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రతిపక్ష పార్టీల నేతలు ప్రశ్నిస్తే వాళ్లపై కులాన్ని ప్రస్తావిస్తూ సిగ్గుమాలిన విమర్శలు చేయడం మీకే చెల్లిందని మండిపడ్డారు. ఫామ్ హౌస్ లో నుంచి కేటీఆర్, హరీష్ రావు అనే రెండు కుక్కలను వదిలారని వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని,ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఎలా నెరవేరుస్తారో చెప్పకుండా ఇష్టానుసారంగా మాట్లాడడం కాంగ్రెస్ నేతలకు చెల్లిందని అన్నారు.ఈ మీడియా సమావేశంలో బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షులు నటరాజన్, కౌన్సిలర్లు జి.టి శ్రీనివాస్,గోపాల్, మహమ్మద్ ఎజాజ్ (అడ్డు), మాజీ కౌన్సిలర్ వెంకట్రాం రెడ్డి, నాయకులు రవి యాదవ్,అశోక్, రాఘవేందర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## అక్షర వెలుగుల పంతులమ్మ... ఈ అరుణమ్మ..

**మూడు దశాబ్దాల ఉత్తమ సేవకు జిల్లా స్థాయి పురస్కారం..**

**చిన్నారి పేద విద్యార్థులకు అమ్మగా టీచరమ్మ అరుణ.. గతంలోనూ ప్రశంసలు.. పురస్కారాలు..**



**షాద్ నగర్,(ప్రజావినికిడి):** కేవలం పుస్తకం పట్టి చదువు చెప్తే సరిపోదు.. అవసరమైతే విద్యార్థులకు అమ్మగా మారాలి.. ఆప్యాయతతో వారిని చేరదీయాలి.. అర్థమయ్యేలా చదువు చెప్పి వారి భవిష్యత్తుకు వారధి కావాలి.. అలాంటి ఉపాధ్యాయులే విద్యార్థులకు చేరువ అవుతారు.. విద్యార్థుల్లో అలాంటి అరుణోదయాన్ని సృష్టించి వారిని తీర్చిదిద్ది ప్రస్తుతం ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకున్న టీచర్ అమ్మ ఎన్. అరుణ,బ్యాంకు ఉద్యోగి బాలకృష్ణ సతీమణి అరుణ షాద్ నగర్ పట్టణంలోని సీఎస్కే లో నివాసం ఉంటున్నారు. కేశంపేట మండలం పాపిరెడ్డి గూడ మండల ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు. వివిధ చోట్ల పనిచేసిన ఆమె ఎక్కడ పనిచేసిన విద్యార్థులను సొంత బిడ్డలుగా చూసుకుంటూ మంచి బోధన అందిస్తూ ముందుకు సాగారు. అందుకు తగ్గట్టుగానే మంచి ఫలితాలు కూడా తీసుకువచ్చారు. అంతేకాకుండా చదువుతోపాటు విద్యార్థులను విభిన్నంగా కొత్త మార్గాలలో పాఠాలు అర్థమయ్యేలా చెప్పడం ఈమె ప్రత్యేకత.ఈ క్రమంలోనే ఇటీవల ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలు పురస్కారం ఈమె అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె స్పందిస్తూ ఈ పురస్కారం తన బాధ్యతను పెంచిందని, మరింత ఉన్నతంగా విద్యార్థుల కోసం పనిచేస్తానని వెల్లడించారు. పురస్కారాలు అందుకోవడం పట్ల ఏదో ఉపాధ్యాయ సంఘాల నాయకులు అభినందనలు తెలియజేశారు.

## షాద్‌నగర్‌లో 'దశ 10 ఫుడ్ పార్క్' ప్రారంభం

**ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి..**





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**షాద్‌నగర్ పట్టణంలో ఆహార ప్రియుల కోసం సరికొత్త రుచులతో 'దశ 10 ఫుడ్ పార్క్' అందుబాటులోకి వచ్చింది.పాత జాతీయ రహదారి (జడ్చర్ల రోడ్డులో) నూతనంగా ఏర్పాటు చేసిన ఈ ఫుడ్ పార్క్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి హాజరై ఫుడ్ పార్క్‌ను ప్రారంభించి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా చౌలపల్లి ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ,షాద్‌నగర్ పట్టణం రోజురోజుకూ అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రజల అభిరుచులకు అనుగుణంగా నూతనంగా 'దశ 10 ఫుడ్ పార్క్' అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని పరిశుభ్రమైన వాతావరణంలో ప్రజలకు అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఫుడ్ పార్క్ వ్యాపారపరంగా మంచి విజయాన్ని సాధించి ప్రజల ఆదరణ పొందాలని ఆకాంక్షిస్తూ నిర్వాహకులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నేత బండారు రమేష్, బీజేపీ నేత చెంది మహేందర్ రెడ్డి, మహిళా సహకార సంఘాల డైరెక్టర్ అరుంధతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రముఖులు, వ్యాపారవేత్తలు, మిత్రులు,ఆహార ప్రియులు,పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై 'దశ 10 ఫుడ్ పార్క్' నిర్వాహకులకు అభినందనలు తెలిపారు

## ప్రతీ ఆటో కార్మికుడికి బాకీ పడ్డ 36 వేల రూపాయలను ఎప్పుడు చెల్లిస్తావ్ రేవంత్ రెడ్డి..

**బిఆర్ఎస్ ఎల్పీ విప్,ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్..**



**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):** కాంగ్రెస్ 1000 రోజుల దగా పాలనలో భాగంగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వారం రోజులపాటు నిర్వహించనున్న నిరసన కార్యక్రమంలో భాగంగా ఐదవ రోజు మౌలిక వసతుల కల్పనలో కాంగ్రెస్ ప్రభుత్వ విఫలం, ఆటో కార్మికులకు సంవత్సరానికి 12 వేల రూపాయలు ఇస్తామని చెప్పి మోసం చేసిన తీరును నిరసిస్తూ బిఆర్ఎస్ ఎల్పి విప్,ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ఆధ్వర్యంలో సుచిత్ర చౌరస్తా నుంచి జీడిమెట్ల గ్రామం గాంధీ విగ్రహం వరకు ఆటో కార్మికులతో కలిసి బిఆర్ఎస్ శ్రేణులు భారీ ఆటో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పి విప్,ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మాట్లాడుతూ,ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఆచరణకు సాధ్యం కానీ అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఆటో కార్మికులను రోడ్డున పడేసింది. ప్రతి ఆటో కార్మికుడికి సంవత్సరానికి 12 వేల రూపాయలు ఇస్తామని చెప్పిన అబద్ధాల కాంగ్రెస్ ప్రభుత్వం మూడు సంవత్సరాలైనా 12 వేల రూపాయల కాదు కదా 12 పైసలు కూడా ఇవ్వకుండా ఆటో కార్మికులను మోసం చేసింది. మూడు సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వం ఒక్కో ఆటో కార్మికుడికి 36వేల రూపాయలను బాకీ ఉందని, రేవంత్ రెడ్డి ఈ బాకీ ని ఎప్పుడు చెల్లిస్తారో ఆటో కార్మికులకు స్పష్టం చేయాలి. హైదరాబాద్ నగరంలో రాత్రి అయితే చాలు ఎక్కడ చూసిన చిమ్మ చీకట్లు అలుముకుంటున్నాయి.కొత్త వీధి దీపాల ఏర్పాటును పక్కకు పెడితే ఉన్న వీధి దీపాల నిర్వాహణను కూడా నిర్వహించలేని నిస్సహాయ స్థితిలో ప్రభుత్వం ఉంది.నగరంలో ఎక్కడ ఏ రోడ్డు చూసినా డ్రైనేజీ మూతలు కుంగడం వాటి స్థానం లో కొత్తవి మార్చకపోవడంతో వాహనదారులు, అటుగా వెళ్లే పాదాచారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్న ప్రజలకు మౌనిక వసతులను కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందిఅని అధికార కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు.ఈ కార్యక్రమంలో భాగంగా బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కుంట సిద్ధిరాములు ఆటో కార్మికుల 36వేల రూపాయలను వెంటనే కార్మికులకు చెల్లించాలనీ లేదంటే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆటో కార్మికుల పక్షాన నిలబడి పెద్ద ఎత్తున నిరసన ధర్నా కార్యక్రమాలు చేపడతామని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆటోలను నడుపుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరుపై విమర్శించారు.



అతీవేగంగా విస్తరిస్తున్న నార్త్ హైదరాబాద్ నగరాన్ని పక్కకు పెట్టి సీఎం తన ఊహల నగరమైన ఫోర్త్ సిటీకి అధిక ప్రాధాన్యతనిస్తూ హైదరాబాద్ నగర ప్రజలను విస్మరిస్తున్నారు. వేగంగా విస్తరిస్తున్న నార్త్ హైదరాబాద్ సిటీకి మెట్రో రైలు మార్గం ఎంతో అవసరం. కానీ ప్రభుత్వం మాత్రం నార్త్ హైదరాబాద్ సిటీని పక్కకు పెట్టి ఫోర్త్ సిటీ పేరుతో రాజకీయాలు చేస్తూ ఇక్కడి ప్రజలను మోసం చేస్తుంది.ఇదే విషయంలో మెట్రో సాధన సమితి సభ్యులు, ప్రజల పక్షాన మేము ఎన్ని సార్లు ధర్నాలు చేసినా ప్రభుత్వంలో మాత్రం ఎటువంటి చలనం లేదు.ఫోర్త్ సిటీలో కనీసం ఒక మనిషి నివసించే పరిస్థితి లేదు. అలాంటి నగరాన్ని అభివృద్ధి చేస్తున్నామంటూ నానా హైరానా చేస్తూ హైదరాబాద్ మహానగరాన్ని మూడు ముక్కలు చేసి మౌలిక వసతులను కల్పించకుండా ప్రజలకు తీవ్ర అవస్థలు కలిగిస్తున్నారు. యథా రాజా తథా ప్రజా..అనే విధంగా రాష్ట్రంలో గుంపు మేస్త్రి వ్యవహరిస్తుంటే స్థానికంగా ఉన్న కొందరు కాంగ్రెస్ నాయకులు కార్లల్లో కొబ్బరికాయలు పెట్టుకొని తిరుగుతూ ఎక్కడపడితే అక్కడ కొబ్బరికాయలు కొడుతూ చెడ్డి గ్యాంగ్ లా కొబ్బరికాయల గ్యాంగ్ తయారయ్యారు.మరికొన్ని ప్రాంతాల్లో అయితే సంక్షేమ సంఘాల సభ్యులను బ్రతిమిలాడి చీకట్లలో ఉన్న వారి రాజకీయ భవిష్యత్తులో చివరి ప్రయత్నంగా నానా హైరానా చేస్తూ ఫోటో ఫోజుల కోసం, వారి అధిష్టానం మెప్పుకోసం, లేనిది ఉన్నట్లుగా అర్హత లేకున్నా కొబ్బరికాయలు కొడుతూ చిల్లర రాజకీయాలు చేస్తున్నారు. ఇకనైనా స్థానిక కాంగ్రెస్ నాయకులు ఈ కొబ్బరికాయల చిల్లర రాజకీయాలను బంద్ చేయాలి. ప్రజలు అంతా గమనిస్తూ ఉన్నారు.మీరు ఎన్ని వేషాలు వేసిన ప్రజలు మళ్లీ ముఖ్యమంత్రిగా కెసిఆర్ ని కోరుకుంటున్నారు.రానున్న ఎన్నికల్లో కెసిఆర్ మళ్లీ సీఎం అవ్వడం కాయం.. కాంగ్రెస్ పార్టీ భూస్థాపితం అవ్వడం ఖాయం.ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన వివిధ మున్సిపాలిటీల మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, పార్టీ నాయకులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక సంక్షేమ సంఘాల సభ్యులు,ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## బహదూర్ పల్లి లో కాఫీ చాయ్ బంక్ ను ప్రారంభించిన బొంగునూరి కిషోర్ రెడ్డి




**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి బహదూర్ పల్లి 294 డివిజన్ లో అరవింద్ రెడ్డి కాఫీచాయ్ బాంక్ ను ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రోటోకాల్ కోఆర్డినేషన్ వైస్ ఛైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి,ఈ సందర్భంగా షాపు నిర్వాహకులు ఆయనను శాలువాతో సత్కరించి అభినందనలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు యాజమాన్య కుటుంబ సభ్యులు, స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# వెయ్యి రోజుల పాలనపై చర్చకు సిద్ధమా?

**బీఆర్ఎస్ నేతలకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సవాల్..**

**ఇందిరాపార్క్ మహాధర్నాకు షాద్‌నగర్ నుంచి 30 వాహనాల్లో భారీగా తరలివెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు..**

**టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద ధర్నా..**





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేపట్టిన వెయ్యి రోజుల పాలనకు, బీఆర్ఎస్ పదేళ్ల పాలనకు మధ్య ఉన్న తేడాపై బహిరంగ చర్చకు సిద్ధమా? అంటూ షాద్‌నగర్ ఎమ్మెల్యే,రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ బీఆర్ఎస్ నేతలకు సవాల్ విసిరారు. హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద ఆదివారం కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన మహాధర్నాలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొని మాట్లాడారు. ఎక్కడైనా.. ఎప్పుడైనా చర్చకు సిద్ధం అని స్పష్టం చేసిన ఎమ్మెల్యే, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయం కోసం చేపట్టిన కార్యక్రమాలను బీఆర్ఎస్ పదేళ్ల పాలనతో పోల్చి చూపించాలని అన్నారు.ప్రజల కోసం పనిచేస్తున్న ప్రభుత్వాన్ని విమర్శించే ముందు గత పదేళ్ల పాలనలో ప్రజలకు ఏం చేశారో బీఆర్ఎస్ నేతలు ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు.
కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని కేంద్రంగా చేసుకుని పాలన సాగిస్తోందని వీర్లపల్లి శంకర్ అన్నారు.గత ప్రభుత్వం రాష్ట్రంపై మోపిన భారీ అప్పుల భారాన్ని మోస్తూనే సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. పేదలకు సన్నబియ్యం అందించడం, అర్హులైన వారికి రేషన్ కార్డులు మంజూరు చేయడం వంటి కార్యక్రమాలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతోందన్నారు.
రేషన్ కార్డుల కోసం లక్షలాది దరఖాస్తులు వస్తున్న పరిస్థితుల్లో గత ప్రభుత్వం అర్హులైన వారికి ఎందుకు రేషన్ కార్డులు ఇవ్వలేదని ప్రశ్నించారు. ప్రజల అవసరాలను గుర్తించి అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు.కేటీఆర్ చేస్తున్న విమర్శలపై స్పందించిన వీర్లపల్లి శంకర్.. చదువు కంటే సంస్కారం ముఖ్యమని, ఉన్నత విద్యను అభ్యసించిన వారు సమాజానికి ఏం చేశారో కూడా ప్రజలు ప్రశ్నిస్తున్నారని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులు, కవులు, కళాకారులకు గౌరవం కల్పిస్తోందన్నారుగద్దర్,అందెశ్రీ వంటి తెలంగాణ ఉద్యమ స్ఫూర్తికి ప్రతీకలైన వ్యక్తులను గౌరవించడం, మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాలను ఏర్పాటు చేయడం,సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వంటి మహనీయుల గుర్తింపును పెంచడం కాంగ్రెస్ ప్రభుత్వ సామాజిక దృక్పథానికి నిదర్శనమన్నారుబీసీ కులగణన విషయంలో కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తామని ఎమ్మెల్యే



స్పష్టం చేశారు.బీసీలకు జనాభా ప్రాతిపదికన న్యాయం జరగాలంటే కులగణన ఎంతో కీలకమన్నారు. బీసీ వర్గాలకు చెందిన బీజేపీ నాయకులు ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఉద్దేశించి వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ,
ప్రతిపక్ష నేతగా అసెంబ్లీకి వచ్చి ప్రభుత్వంతో ప్రజా సమస్యలపై చర్చించాలని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వంలో తప్పులు ఉంటే అసెంబ్లీ వేదికగా వాటిని ఎత్తిచూపాలని, ప్రజల ముందే చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు.కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి చర్చిస్తే గత పాలనకు, ప్రస్తుత పాలనకు ఉన్న తేడా ప్రజలకు స్పష్టంగా తెలుస్తుందని అన్నారు.
బీఆర్ఎస్ సోషల్ మీడియా ప్రచారాలతో క్షణికానందం పొందవచ్చేమో కానీ ప్రజల తీర్పును మార్చలేరని ఎమ్మెల్యే అన్నారు. బీఆర్ఎస్ రాజకీయంగా బలహీనపడిపోయిందని, తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పాలనపై విశ్వాసం ఉంచుతున్నారని పేర్కొన్నారు. బీజేపీ,బీఆర్ఎస్ కలిసి అధికారంలోకి వస్తామని కలలు కనడం తప్ప.. ప్రజల్లో ఆ పార్టీలకు ఆదరణ లేదని విమర్శించారు.హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా అభివృద్ధి చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని వీర్లపల్లి శంకర్ అన్నారు. పెట్టుబడులను ఆకర్షించడం, ఉపాధి అవకాశాలు పెంచడం, మౌలిక వసతులను అభివృద్ధి చేయడం ద్వారా తెలంగాణను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

**షాద్‌నగర్ నుంచి భారీగా తరలివెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు**

ఇందిరాపార్క్ వద్ద జరిగిన కాంగ్రెస్ మహాధర్నాకు షాద్‌నగర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపు మేరకు సుమారు 30 వాహనాల్లో కాంగ్రెస్ శ్రేణులు హైదరాబాద్‌కు బయలుదేరాయి. ఫరూఖ్‌నగర్, కొత్తూరు, నందిగామ, కేశంపేట, చౌదరిగూడ, కొందుర్గు మండలాలతో పాటు షాద్‌నగర్ పట్టణం నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు వాహనాల్లో తరలివెళ్లి ఇందిరాపార్క్ ధర్నాలో పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ జెండాలు, నినాదాలతో షాద్‌నగర్ నియోజకవర్గానికి చెందిన వాహనాలు హైదరాబాద్ వైపు కదలడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. మహాధర్నాలో రాష్ట్రస్థాయి కాంగ్రెస్ నాయకులతో పాటు షాద్‌నగర్ నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతు తెలిపారు.

# ప్రజల అభిరుచులకు అనుగుణంగా 'దశ 10 ఫుడ్ పార్క్' ఏర్పాటు అభినందనీయం

**షాద్‌నగర్‌లో ఘనంగా ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**హాజరైన మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్,వైస్ చైర్మన్ అందె మోహన్, తదితర కౌన్సిలర్లు..**

**విశిష్ట అతిథులుగా వీహెచ్పీ నేత బండారు రమేష్, ఆర్ఎస్ఎస్ ప్రముఖ్ నాగిళ్ళ కుమార్**

**శుభాకాంక్షలు తెలిపిన మున్సిపల్ చైర్పర్సన్ సులోచన కృష్ణారెడ్డి, మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాయికల్ శ్రీనివాస్, పురుషోత్తం రెడ్డి,బాలరాజు గౌడ్,శ్రీధర్, తదితరులు**





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
పట్టణ ప్రజల అభిరుచులు, అవసరాలకు అనుగుణంగా ఆధునిక వసతులతో 'దశ 10 ఫుడ్ పార్క్' ఏర్పాటు చేయడం అభినందనీయమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పాత జడ్చర్ల రోడ్డులో మధురపూర్ భార్గవ్ గౌడ్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'దశ 10 ఫుడ్ పార్క్' గ్రాండ్ ఓపెనింగ్ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి,రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, షాద్‌నగర్ పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని, పట్టణ అభివృద్ధికి అనుగుణంగా ప్రజలకు మెరుగైన సేవలు, సౌకర్యాలు అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు.ఫుడ్ పార్క్‌లో ప్రజలకు నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందించాలని నిర్వాహకులను కోరారు. పరిశుభ్రత, నాణ్యత విషయంలో రాజీ పడకుండా వినియోగదారుల విశ్వాసాన్ని పొందాలని సూచించారు. ఫుడ్ పార్క్ ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు, వ్యాపారపరంగా మంచి విజయాన్ని సాధించాలని ఆకాంక్షిస్తూ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.
ఫుడ్ పార్క్‌లోని పలు విభాగాలను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించగా, మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్,వైస్ చైర్మన్ అందె మోహన్‌తో పాటు జ్ఞాన ప్రసూన-మాధవరెడ్డి దంపతులు టిఫిన్ సెంటర్‌ను లాంఛనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, సీనియర్ నేత కృష్ణారెడ్డి, విశ్వహిందూ పరిషత్ నేత బండారు రమేష్, సీనియర్ జర్నలిస్ట్ కె.పి, ఆర్ఎస్ఎస్ ప్రముఖ్ నాగిళ్ల కుమార్,బీజేపీ నేత చెంది మహేందర్ రెడ్డి, కృష్ణ మహేష్, ప్రజాసేన ఆల్ ఇండియా అధ్యక్షులు ఎండి ఖాదర్ గోరి, కౌన్సిలర్లు ప్రవీణ్ కుమార్, పెంటయ్య, బచ్చలి నరేష్, రాజు నాయక్, మురళీమోహన్, అప్పి,సింగిల్ విండో వైస్ చైర్మన్ తుపాకుల శేఖర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజ్ గౌడ్, పార్టీ అధ్యక్షులు రాయికల్ శ్రీనివాస్, పురుషోత్తం రెడ్డి, నల్లమోని శ్రీధర్, కాంగ్రెస్ మైనార్టీ నాయకులు ముబారక్ అలీ





ఖాన్,కొత్తపేట ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.
పట్టణ ప్రజలు, వ్యాపారవేత్తలు, నాయకులు, మిత్రులు పెద్ద సంఖ్యలో హాజరై నిర్వాహకులు మధురపూర్ భార్గవ్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## కేసీఆర్ ప్రతిపక్ష నేత పదవికి రాజీనామా చేయాలి.. -కాంగ్రెస్ ధర్నా



**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):**కేసీఆర్ ప్రతిపక్ష నేతగా ప్రజల సమస్యలపై బాధ్యత వహించడంలో విఫలమయ్యారని ఆరోపిస్తూ, ఆయన వెంటనే ప్రతిపక్ష నేత పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద నిర్వహించిన భారీ ధర్నా కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన డీసీసీ కమిటీ సభ్యులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్ యుఐ, ఐఎన్టియుసి, ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనారిటీ విభాగాల నాయకులు మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పిడుగు పడి వ్యక్తి మృతి



**వాజేడు, సెప్టెంబర్ 7,(ప్రజావినికిడి):**
ములుగు జిల్లావాజేడు మండలం చింతూరు గ్రామానికి చెందిన ములకల ఆనందరావు(50) చెరుకూరులో వేరే రైతు చేను ఎద్దుల నాగలితో దున్నుతుండగ పిడుగు పాటుకు గురై ఉదయం మృతి చెందారు.చెరుకురు గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది.పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది

## గ్రామాల్లో బోనాల పండుగ సంబరాలు





**వాజేడు,సెప్టెంబర్ 7,(ప్రజావినికిడి):**వాజేడు మండలంలోని భువనపల్లి గ్రామంలో గ్రామ దేవతల విగ్రహ బొడ్రాయి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బోనాలు రోజు యాగశాల అలంకరణ, నాలుగు దిక్కుల తోరణాలు నిర్మాణం,జ్యోతి ప్రజ్వలన, విఘ్నేశ్వర పుణ్యాహవాచనం ప్రసాదాలు కర్పూర హారతి కార్యక్రమాలు నిర్వహించారు. శ్రావణమాసం రోజు ఆదివారం సుప్రభాత సేవ, నిత్య పూజ కార్యక్రమాలు, నిత్య అగ్ని హోమాలు, క్షీరాదివాసం, జలాదిస్నానాలు, మంగళ హారతి ఊరేగింపు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. గ్రామ ఆడపడుచులకు అమ్మవారి బోనాలు సమర్పించుట, నైవేద్యం, ముడుపులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. బొడ్రాయి గ్రామదేవతలు ఉదయం వేద పండితులచే మంత్రోచ్ఛరణాల నడుమ ప్రతిష్టాపించారు. గ్రామ పెద్దల సమక్షంలో పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అగ్ని,ప్రతిష్టాపన, హోమం, బొడ్రాయి, ఊరేగింపు, అభిషేకం తదితర కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. మహిళలు మంగళహారతితో ఊరేగిపుగా వెళ్లి గ్రామంలో ప్రతిష్టాపన చేసిన బొడ్రాయి దేవతమూర్తులకు నైవైద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు,మహిళలు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**రేగులపాడులోబోనాలు**

వాజేడు మండలం చెరుకూరు,గ్రామ పంచాయతీ రేగులపాడులో యల్లనంపుడు, పండగతో పాటు బోనాల పండుగ నిర్వహించారు పెద్దలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# నిజాంపేట్‌లో చెత్త సమస్యపై బీఆర్ఎస్ నేతల ఆందోళన

**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):**
నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని పలు కాలనీల్లో డీజిల్ లేక చెత్త వాహనాలు నిలిచిపోవడంతో పారిశుధ్య సమస్య తీవ్రంగా మారిందని కాలనీలోచేత్త పేరుకుపోయింది బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. కాలనీల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించకపోవడంతో దుర్వాసనతో పాటు దోమలు, ఈగలు పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.
ఈ సమస్యపై నిజాంపేట్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్,పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు చెత్తను సేకరించి నిజాంపేట్ సర్కిల్ కార్యాలయం ముందు వేసి నిరసన తెలిపారు. అనంతరం డిప్యూటీ కమిషనర్‌ను కలిసి సమస్యను వివరించి, కాలనీల్లో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించేలా సత్వరమే చర్యలు తీసుకోవాలని కోరారు. జీహెచ్ఎంసీలో విలీనమైన తర్వాత కూడా నిజాంపేట్



ప్రాంత ప్రజల సమస్యలు పరిష్కారం కావడం లేదని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. ప్రజా సమస్యలపై ఎన్నిసార్లు ఫోన్ చేసినా కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్, నిజాంపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ స్పందించడం లేదని ఆరోపించారు. ప్రజలకు కనీస పారిశుధ్య సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం, అధికారులు విఫలమవుతున్నారని విమర్శించారు.
గతంలో కేటీఆర్ మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఏదైనా సమస్యపై ట్వీట్ చేస్తే 15 నిమిషాల్లోనే స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకునేవారని, ప్రస్తుతం ముఖ్యమంత్రి వద్దే మున్సిపల్ శాఖ ఉన్నప్పటికీ సమస్యలను పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదని బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు.
నిజాంపేట్‌లో మున్సిపల్ శాఖ అధికారులు బలహీన వర్గాల మీద తమ ప్రతాపం చూపించడం కాకుండా, కాలనీల్లో పేరుకుపోతున్న చెత్త,డ్రైనేజీ,వీధి దీపాలు, తాగునీరు వంటి ప్రజల మౌలిక సమస్యలపై దృష్టి పెట్టాలి. పారిశుధ్య సమస్యను తక్షణమే పరిష్కరించకపోతే ప్రజలతో కలిసి మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం అని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు.

# అక్రమ నిర్మాణాలకు ‘ఓసీ’ కవచం..




**ఓసీ దందాలో లక్షల వసూళ్లు.?**
**అనుమతులు గాలికి,ఓసీలు చేతికి**
**అక్రమ భవనాలకు అధికారిక ముద్ర**
**సికింద్రాబాద్ జోన్‌లో ‘ఓసీ’ల గోల**
**రూ.50 లక్షల వరకు ఓసీ రేటా.?**
**మధ్యవర్తుల చేతిలో టౌన్‌ప్లానింగ్ ఫైళ్లు**
**ఓసీ ఇచ్చి అక్రమాలను సక్రమం చేస్తున్నారా.?**
**విజిలెన్స్ దృష్టి సారిస్తే ఓసీల బాగోతం బట్టబయలు**
**ఓసీ దందాలో కాసుల వర్షం.. ఖజానాకు కోట్ల నష్టం.?**

**సికింద్రాబాద్, (ప్రజావినికిడి):** అక్రమ నిర్మాణాలపై కొరడా ఝుళిపించాల్సిన టౌన్‌ప్లానింగ్ విభాగమే వాటికి అండగా నిలుస్తోందన్న ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు (ఓసీలు) జారీ చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఓసీ చేతికి వస్తే చాలు అక్రమ నిర్మాణం కాస్తా సక్రమ నిర్మాణంగా మారిపోతుందన్న పరిస్థితి నెలకొందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### ఓసీ వస్తే అంతా ఓకేనా.?

నిర్మాణ అనుమతులకు విరుద్ధంగా అదనపు అంతస్తులు నిర్మించినా, సెట్‌బ్యాక్ నిబంధనలు ఉల్లంఘించినా, పార్కింగ్ స్థలాలను ఆక్రమించినా చివరకు ఓసీ జారీ అయితే విద్యుత్ మీటర్లు, నీటి కనెక్షన్లు, ఆస్తి పన్ను వంటి వ్యవహారాలు సైతం సులభంగా సక్రమం అవుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి.దీంతో అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన వ్యవస్థ వాటికి చట్టబద్ధత కల్పిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై స్థానిక ప్రజలు అప్రమత్తంగా ఉండి ఫిర్యాదులు చేస్తే వెంటనే వాటిని జారీ చేసిన అధికారులపై చర్యలు తీసుకుంటామని కమిషనర్లు గతంలో పేర్కొన్న వాటిపై వస్తున్న ఫిర్యాదులపై ఆశించిన స్థాయిలో చర్యలు తీసుకోవడం లేదని ప్రజల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ఒక్కో ఓసీ వెనుక రూ.15 లక్షల నుంచి రూ.50 లక్షలా.?

సికింద్రాబాద్ జోన్ పరిధిలోని పలు సర్కిళ్లలో ఓసీ జారీ వ్యవహారంలో భారీగా నగదు చేతులు మారుతున్నట్లు ప్రజల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఒక్కో ఓసీ కోసం రూ.15 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. వీటిపై విజిలెన్స్ అధికారులచే పూర్తిస్థాయి విచారణ చేయిస్తే వాస్తవాలు బయటికి వస్తాయని ప్రజలు కోరుతున్నారు. సర్కిల్ కార్యాలయం నుంచి జోనల్ కార్యాలయం, అక్కడి నుంచి ప్రధాన కార్యాలయం వరకు మధ్యవర్తుల నెట్‌వర్క్ పూర్తిస్థాయిలో పనిచేస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నేరుగా అధికారులను కలవాల్సిన అవసరం లేకుండా ‘పని పూర్తి చేస్తాం’ అంటూ మధ్యవర్తులు వ్యవహారాలను చక్కబెడుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో ఎవరి పాత్ర ఎంత.? ఏ ఏ అధికారి ఇప్పటివరకు ఎన్ని ఓసిలు అక్రమ మార్గంలో జారీ చేశారు. అన్నది దర్యాప్తుతోనే తేలాల్సి ఉంది.

### ప్రభుత్వ ఖజానాకు భారీ గండి

అక్రమ నిర్మాణాలకు ఓసీలు జారీ అయితే కేవలం నిబంధనల ఉల్లంఘనే కాదు. ప్రభుత్వ ఆదాయానికీ నష్టం వాటిల్లే అవకాశం ఉంది. అక్రమంగా నిర్మించిన అదనపు అంతస్తులు, మార్పులు, వినియోగ ఉల్లంఘనలకు సంబంధించిన జరిమానాలు, ఫీజులు,ఇతర ప్రభుత్వ బకాయిలు వసూలు కాకపోతే కోట్ల రూపాయల ఆదాయం కోల్పోయే ప్రమాదం ఉందని ఇప్పటికే నగరంలో లక్షలలో అక్రమ నిర్మాణాలు ఉన్నాయి వాటిపై ప్రభుత్వానికి టాక్స్ రూపంలో నిధులు రావడం లేదన్న విమర్శలు ఉన్నాయి మరి దీనిపై ప్రభుత్వం ఎందుకు కఠినంగా వ్యవహరించడం లేదో అర్థం కాని పరిస్థితి నెలకొన్నది.

### సర్కిల్.. జోన్.. హెడ్ఆఫీసు..

ఓసీల జారీ ప్రక్రియలో ఏ స్థాయిలో అక్రమాలు జరుగుతున్నాయన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది.కేవలం ఒక సర్కిల్ స్థాయిలోనేనా.? జోనల్ స్థాయిలోనూ వ్యవహారం సాగుతోందా.? ప్రధాన కార్యాలయంలోనూ ఫైళ్లకు ‘క్లియరెన్స్’ లభిస్తోందా.? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.
టౌన్‌ప్లానింగ్ విభాగంలో గత కొన్నేళ్లలో జారీ చేసిన ఓసీలపై విజిలెన్స్,ఏసీబీ అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అనుమతులు, నిర్మాణ స్థితి, ఫైల్ నోటింగ్స్, తనిఖీ నివేదికలు,ఓసీ జారీ తేదీలు, సంబంధిత అధికారుల నిర్ణయాలను పరిశీలిస్తే అక్రమ ఓసీల జారీ దందాలు, అక్రమాలకు సంబంధించిన అసలు గుట్టు బయటపడే అవకాశం ఉందని ప్రజలు సూచిస్తున్నారు.

### సికింద్రాబాద్ జోన్ ఫైళ్లను బయటకు తీయాలి.

సికింద్రాబాద్ జోన్ పరిధిలోని అన్ని సర్కిళ్లలో జారీ చేసిన ఓసీలను ర్యాండమ్‌గా పరిశీలించి, అనుమతులకు అనుగుణంగా నిర్మాణం ఉందా.? వాస్తవ పరిస్థితిని అధికారులు తనిఖీ చేశారా.? నిబంధనల ఉల్లంఘనలను ఎందుకు పట్టించుకోలేదు.? అనే అంశాలపై ఆడిట్ నిర్వహించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.
అక్రమ నిర్మాణాలకు ఓసీలు ఇచ్చి ప్రభుత్వానికి ఆర్థిక నష్టం చేయడంతో పాటు ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే నిర్మాణాలను ప్రోత్సహిస్తే భవిష్యత్తులో జరిగే ప్రమాదాలకు బాధ్యత ఎవరిది.? అధికారులపై వస్తున్న ఆరోపణలు నిజమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.
అక్రమ నిర్మాణాలకు ఓసీ లు ఇచ్చే వ్యవహారంపై కమిషనర్లు సమగ్ర దర్యాప్తు జరిగితే ఎన్ని ఫైళ్లు బయటపడతాయి.? ఎన్ని కోట్లు ప్రభుత్వ ఖజానాకు చేరకుండా ఆగిపోయాయి.? అసలు ఈ దందా వెనుక ఎవరి హస్తం ఉంది.? అన్న ప్రశ్నలకు సమాధానం ఖచ్చితంగా దొరకాల్సిందే

# గురువుల సేవలు సమాజానికి మార్గదర్శకం

**మండల విద్యాధికారి టీ. మనోహర్ - షాద్‌నగర్‌లో ఘనంగా ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కార ప్రదానోత్సవం**

**తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యాల సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కారం**




**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని పలువురు వక్తలు పేర్కొన్నారు. తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యాల సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కార ప్రదానోత్సవాన్ని ఆదివారం షాద్‌నగర్‌లోని సాయిరాజా ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో దాదాపు 50 పాఠశాలలకు చెందిన 250 మంది ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, పాఠశాలల నిర్వాహకులు పాల్గొన్నారు.ప్రతి పాఠశాల నుంచి బాలవిహార్, ప్రాథమిక,ఉన్నత పాఠశాల విభాగాల నుంచి ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి పురస్కారాలు, జ్ఞాపికలు, ధ్రువపత్రాలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.





కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాధికారి టీ. మనోహర్ మాట్లాడుతూ, విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు.మంచి గురువు విద్యార్థికి కేవలం పాఠ్యాంశాలను మాత్రమే బోధించకుండా క్రమశిక్షణ, విలువలు, బాధ్యత,మంచి వ్యక్తిత్వాన్ని అందిస్తారని పేర్కొన్నారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల సేవలు ఎప్పటికీ ప్రత్యేకమైనవని తెలిపారు.సీనియర్ విద్యావేత్త రాజేందర్ ప్రసాద్ మాట్లాడుతూ, ప్రస్తుత సమాజంలో సామాజిక మాధ్యమాల ప్రభావం విద్యార్థులపై పెరుగుతున్న నేపథ్యంలో వారికి సరైన దిశానిర్దేశం చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై మరింత పెరిగిందన్నారు. అంతర్జాల తరగతులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, కృత్రిమ మేధస్సు అందుబాటులోకి వచ్చినప్పటికీ విద్యార్థి మనస్తత్వాన్ని అర్థం చేసుకుని, అతని సామర్థ్యాలను గుర్తించి వ్యక్తిగతంగా ప్రోత్సహించే గురువు స్థానాన్ని ఏ సాంకేతికతా భర్తీ చేయలేదన్నారు. సాంకేతిక పరిజ్ఞానం విద్యకు సహాయక సాధనం మాత్రమేనని, గురువు మాత్రం విద్యార్థి జీవితానికి మార్గదర్శి అని పేర్కొన్నారు.
తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యాల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, శారదా ఆంగ్ల మాధ్యమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డీవీఎన్ స్వామి మాట్లాడుతూ, విద్యార్థి భవిష్యత్తుకు పునాది వేసే వ్యక్తి గురువు అని అన్నారు. విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయడంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, సమాజానికి ఉపయోగపడే మంచి పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. వారి కృషిని గుర్తించి సన్మానించడం ద్వారా మరింత ఉత్సాహంతో పనిచేసేలా ప్రోత్సహించవచ్చని తెలిపారు.
సంఘం పట్టణ అధ్యక్షుడు కే. వంశీకృష్ణ మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తు కోసం నిరంతరం శ్రమిస్తున్న ఉపాధ్యాయుల సేవలను గుర్తించి గౌరవించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచడంతో పాటు ఉపాధ్యాయుల్లో స్ఫూర్తిని పెంపొందించేందుకు భవిష్యత్తులోనూ ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఆనంద్,రిజ్వాన్, స్వాతి రెడ్డి,రఫీన్ సుల్తానా,రాజన్, యూనెస్, మధుసూదన్, థామస్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, వెంకటరమణ, కవిత,అంజద్, వీరేష్, జయభార్గవి, అనురాధ,రాజు, కల్పన రెడ్డి, రమణారెడ్డి, నవీన్ కుమార్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు. 40కి పైగా పాఠశాలల యాజమాన్యాలు ప్రధానోపాధ్యాయులు, నిర్వాహకులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.
“గురువు మారితే విద్యార్థి మారుతాడు.. విద్యార్థి మారితే సమాజం మారుతుంది” అనే సందేశంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది..

# టీచర్స్ క్రికెట్ ప్రీమియర్ లీగ్



**వాజేడు, సెప్టెంబర్ 7,(ప్రజావినికిడి):**ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం రోజు జరిగిన వాజేడు టీచర్స్ క్రికెట్ ప్రీమియర్ లీగ్ -1 ఫైనల్ లో విజయం సాధించి మొదటి బహుమతి కైవసం చేసుకున్న ట్రైబల్ వెల్ఫేర్ థండర్స్ టీం. ఫైనల్ మ్యాచ్ లో పెదగొల్లగూడెం కాంప్లెక్స్ వారియర్స్ టీం పై విజయం సాధించి వాజేడు మండల విద్యా శాఖఅధికారి టి.వెంకటేశ్వర్లు, చేతుల మీదుగా మొదటి బహుమతి అందుకోవడం జరిగింది.మొదటి ట్రోఫీ కోకిల శ్రీరంగం ఎస్ఎ, మరియు రెండవ ట్రోఫీని పి నాగేశ్వరావు ఎస్జిటి,స్పాన్సర్ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఇరు జట్ల కెప్టెన్ లు బద్రి,రాజేష్ ల తో పాటు టీం సభ్యులు నాగేంద్ర ప్రసాద్, జి.అనిల్,ఈ అనిల్,పవన్, చంద్రకాంత్, నరసింహ, సాగర్, రాంబాబు, జయేందర్, బాలాజీ, నర్సింగరావు జనార్దన్ లు పాల్గొన్నారు.

# కేసీఆర్ ని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**బీఆర్ఎస్ పార్టీ అధినేత మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ అధ్యక్షతన ఎర్రవల్లి నివాసం లో బీఆర్ఎస్ శాసనసభాపక్ష (బీఆర్ఎస్ఎల్పీ) సంయుక్త సమావేశంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొనడం జరిగింది. ఈనెల సెప్టెంబర్ 7నుండి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, సభలో అనుసరించాల్సిన వ్యూహాలపై పార్టీ ప్రజాప్రతినిధులకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా సమావేశం అనంతరం బీఆర్ఎస్ అధ్యక్షులు మాజీ ముఖ్య ముఖ్య మంత్రి కేసీఆర్ ని ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు.రేపటి నుండి ప్రారంభం కానున్న అసెంబ్లీ అలాగే శాసన మండలి సమావేశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను,ప్రజా సమస్యలను గట్టిగా ఎండగట్టాలని, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సమస్యలపై మండలిలో గళమెత్తాలని నవీన్ రెడ్డికి కేసీఆర్ దిశానిర్దేశం చేశారు.

# ఆటో కార్మికుల హామీల అమలుకు బీఆర్ఎస్ పోరుబాట..

**ఆటో కార్మికుల హక్కుల కోసం**
**హామీల అమలు కోసం మనమంతా ఒక్కటై పోరాడుదాం.!**
**ఆటో కార్మికుల హామీల అమలుకు బీఆర్ఎస్ పోరుబాట..**
**కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి..**
**ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి డిమాండ్..**









**చైతన్యపురి,(ప్రజావినికిడి):**
బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిశానిర్దేశం మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్న తీరును ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఎల్బీనగర్ భారస పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి చైతన్యపురి డివిజన్ పరిధిలోని బాబు కాంప్లెక్స్ నుండి చైతన్యపురి వరకు ఆటో కార్మికుల మద్దతుగా పోరుబాట కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డిమాట్లాడుతూ, ఆటో కార్మికులు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఆటో నడుపుతూ కుటుంబాలను పోషించుకుంటున్న కార్మికులపై భారం పెంచకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారి సంక్షేమానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని కోరారు.ముఖ్యంగా పలు ప్రధాన డిమాండ్లు తెలిపారు.దానిలో భాగంగా ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని,ఆటో కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని,ఆటో కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని,ఆటో కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని తెలిపారు.అనంతరం సుధీర్ రెడ్డి ఆటో నడుపుతూ భారీ ఆటో ర్యాలీ నిర్వహించడం జరిగింది.ఈ పోరుబాట కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జిన్నారం విఠల్ రెడ్డి,కొప్పుల విఠల్ రెడ్డి,పద్మ నాయక్
డివిజన్ల భారస పార్టీ అధ్యక్షులు తోట మహేష్ యాదవ్,లింగాల రాహుల్ గౌడ్,ఓరుగంటి వెంకటేష్,చంద్రశేఖర్ రెడ్డి,విశ్వప్రేమ్ కుమార్,శివ ప్రకాష్ అలాగే పలువురు ఆటో కార్మికులు,బీఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేశారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు..

## షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..



**షాద్‌నగర్,(ప్రజావినికిడి):**
అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు మంజూరు చేస్తామని షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లిశంకర్‌అన్నారు.షాద్‌నగర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, రేషన్ కార్డు పొందేందుకు ఏ పార్టీ నాయకుడి సిఫారసు అవసరం లేదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే శంకర్.అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ కేవలం మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకుంటే,అధికారులు నిబంధనల ప్రకారం పరిశీలించి అర్హత ఉన్న వారికి రేషన్ కార్డులు మంజూరు చేస్తారని తెలిపారు.ప్రజలు దళారులను ఆశ్రయించాల్సిన అవసరం లేదన్నారు.గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో అడిగిన ప్రతి అర్హ కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు,అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు మంజూరు చేశారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రజా ప్రభుత్వం అర్హులైన ప్రతి పేద కుటుంబానికి రేషన్ కార్డులు మంజూరు చేయడంతో పాటు ఇందిరమ్మ ఇళ్లను కూడా అందిస్తోందన్నారు.ఇందిరమ్మ హయాంలో పేద ప్రజలకు కూడు, గూడు,నీడ కల్పించేందుకు కృషి జరిగిందని,అదే తరహాలో ప్రస్తుత ప్రజా ప్రభుత్వం కూడా ప్రతి పేదవారికి సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తోందని వీర్లపల్లి శంకర్ తెలిపారు.పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు.

**గత ప్రభుత్వం నాణ్యతలేని బియ్యం సరఫరా చేసేది.**
గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నాణ్యత లేని మక్కిన బియ్యం పంపిణీ చేయడంతో పేదలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఆ పరిస్థితిని కొందరు దళారులు తమకు అనుకూలంగా మలుచుకుని దొడ్డు బియ్యాన్ని కొనుగోలు చేసి పాలిష్ చేయించి,తిరిగి సన్న బియ్యం పేరుతో పేదలకు అధిక ధరలకు విక్రయించారని అన్నారు.ప్రస్తుతం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీతో బియ్యం పంపిణీ మరింత సులభతరం, పారదర్శకంగా మారుతుందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు.అర్హత కలిగిన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్,వైస్ చైర్మన్ అందే మోహన్,మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్,కౌన్సిలర్లు,కో-ఆప్షన్ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భోగాపురంలో దారుణం: డబ్బులివ్వలేదని యువకుడికి తాళ్లు కట్టి, బైక్‌తో లాక్కెళ్లిన మెకానిక్



భోగాపురంలో అమానుష ఘటన చోటుచేసుకుంది. చిన్నపాటి నగదు బాకీ కోసం ఓ యువకుడి మెడకు, చేతులకు తాళ్లు కట్టి, నడిరోడ్డుపై ఈడ్చుకెళ్లిన దారుణం స్థానికంగా కలకలం రేపింది. బాధితుడి ఫిర్యాదుతో తీవ్రంగా స్పందించిన పోలీసులు, ఈ ఘటనకు పాల్పడిన ప్రధాన నిందితుడు మహేశ్‌తో సహా మొత్తం ఐదుగురిని అరెస్ట్ చేసి కఠిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.పోలీసుల కథనం ప్రకారం, రామచంద్రరాజుపేటకు చెందిన రాజేశ్ అనే యువకుడు, భోగాపురంలోని మహేశ్ అనే మెకానిక్ వద్ద ఓ బైక్‌ను ట్రయల్ రన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు ఓ కారును ఢీకొట్టాడు. దానికి అయిన మరమ్మతుల ఖర్చును మహేశ్ సోదరుడు చెల్లించగా, ఆ డబ్బును రాజేశ్ తిరిగి ఇవ్వడంలో ఆలస్యం చేశాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి మహేశ్, తన స్నేహితులతో కలిసి రాజేశ్ ను అడ్డగించి, బలవంతంగా ఓ మెకానిక్ షెడ్‌కు తీసుకెళ్లారు. రాత్రంతా అక్కడే నిర్బంధించి, చితకబాది, రూ. 30,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు.అంతటితో ఆగకుండా, ఆదివారం ఉదయం రాజేశ్ చొక్కా విప్పించి, చేతులకు, మెడకు తాళ్లు బిగించి భోగాపురం వీధుల్లో బైక్‌కు కట్టి ఈడ్చుకెళ్లారు. ఈ అమానుష దృశ్యాన్ని చూసి చలించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.
విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ హుటాహుటిన భోగాపురం చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. గంటల వ్యవధిలోనే నిందితులు ఐదుగురినీ అదుపులోకి తీసుకున్నామని ఆయన తెలిపారు. నిందితులపై హత్యాయత్నం (అటెంప్ట్ మర్డర్), ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంతో పాటు ఇతర నాన్-బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ స్పష్టం చేశారు. నిందితులకు కఠిన శిక్ష పడేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. ప్రస్తుతం నిందితులందరినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఘటనపై తదుపరి విచారణ కొనసాగుతోంది.

# చైతన్యపురి లో శ్రావ్యస్ డెంటల్ కేర్ ఘనంగా ప్రారంభోత్సవం.





**కొత్తపేట,(ప్రజావినికిడి):**
శ్రావ్యస్ డెంటల్ కేర్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కె.అశోక్ కుమార్ వై.స్మిత రాణి,
కె.ఆకర్ష్ కె.కమలేశ్వర్రావు కె.డాక్టర్ శ్రావ్య కె.నివృతి,కె.రియా..ఆఫీసర్స్ సిబ్బంది ఉపాధ్యాయ బృందం ఉద్యోగ మిత్రబృందం బంధుమిత్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.అదేవిధంగా కాలనీవాసులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ శ్రావ్య మాట్లాడుతూ, మావద్ద అన్ని రకమైన పళ్లకు సంబంధించిన ట్రీట్మెంట్లు జరుగుతాయని రూట్ కెనాల్ నూతన దంతాలను అమర్చుట మీరు క్లినిక్‌కు వచ్చినప్పుడు మీ దంతవైద్యుడు మీ దంతాలను పరీక్షించవచ్చు. వారు దంతక్షయం, ఇన్ఫెక్షన్ లేదా కట్టుడు పళ్ళ ప్రక్రియను ప్రభావితం చేసే ఏవైనా మునుపటి దంత చికిత్సల సంకేతాల కోసం తనిఖీ చేయవచ్చు.
మూల్యాంకనం: మీ నోటి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించిన తర్వాత,మీ దంతవైద్యుడు ఉత్తమ చికిత్సా విధానాన్ని సూచించడానికి మీ చిగుళ్ళను మరియు చుట్టుపక్కల నిర్మాణాలను మూల్యాంకనం చేస్తారు.మీ దంతవైద్యుడు మీకు సరైన కట్టుడు పళ్ళను ఎంపిక చేసిన తర్వాత,అవి మీకు ఖచ్చితంగా సరిపోయేలా చూసుకోవడానికి మీ చిగుళ్ళ యొక్క ముద్రను తీసుకుంటారు.
ఆ తర్వాత మీ దంతాలకు సరిగ్గా సరిపోయే కట్టుడు పళ్ళ కోసం ఒక ఖచ్చితమైన అచ్చును తయారు చేయడానికి మీ పళ్ళ కొలతలు తీసుకోవచ్చు.
మీ కట్టుడు పళ్ళు సిద్ధమైన తర్వాత,వాటిని అమర్చడానికి మిమ్మల్ని పిలుస్తారు. మరియు ఏవైనా సమస్యలు ఉంటే,దానికి అనుగుణంగా సర్దుబాట్లు చేయబడతాయి.
కట్టుడు పళ్ళకు అలవాటు పడటం:మీరు అలాంటి కట్టుడు పళ్ళకు అలవాటు పడటానికి కొంత సమయం పట్టవచ్చు.కానీ చివరికి,మీరు మీ కట్టుడు పళ్ళ పనితీరును సాధారణ పళ్ళలాగే ఆస్వాదించవచ్చు అని డాక్టర్ శ్రావ్య అన్నారు.

# ఎస్‌బీఐ భారీ విస్తరణ.. 12,000 కొత్త ఉద్యోగాలు, 250 కొత్త బ్రాంచ్‌లు




దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీ×) నిరుద్యోగులకు, బ్యాంకింగ్ ఉద్యోగార్థులకు తీపి కబురు అందించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (ఖీ27) సుమారు 12,000 మంది కొత్త ఉద్యోగులను నియమించుకోవడంతో పాటు, దేశవ్యాప్తంగా 250 కొత్త బ్రాంచ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు ఎస్‌బీఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి వెల్లడించారు.
ఈ నియామక ప్రక్రియలో భాగంగా క్లరికల్ (జూనియర్ అసోసియేట్), ఆఫీసర్ (ప్రొబేషనరీ ఆఫీసర్) కేడర్లలో దాదాపు 11,000 నుంచి 12,000 మందిని తీసుకోనున్నట్లు ఛైర్మన్ తెలిపారు. ఉద్యోగుల పదవీ విరమణలు, బ్యాంకు భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ భర్తీ ప్రక్రియ ఉంటుందని ఆయన వివరించారు. గతేడాది (2025-26) బ్యాంకు సుమారు 1,500 మంది ఐటీ స్పెషలిస్ట్ ఆఫీసర్లతో సహా మొత్తం 25,633 మందిని నియమించుకుంది. అయితే, ఈసారి ఐటీ రంగంలో అంత పెద్ద సంఖ్యలో నియామకాలు ఉండవని, జనరల్ బ్యాంకింగ్ సిబ్బందికే ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు.ఒకవైపు డిజిటల్ బ్యాంకింగ్ సేవలు విస్తరిస్తున్నప్పటికీ, భౌతిక బ్రాంచ్‌ల ప్రాధాన్యాన్ని కూడా బ్యాంకు గుర్తిస్తోందని ఛైర్మన్ అన్నారు. ఇందులో భాగంగా, కొత్తగా అభివృద్ధి చెందుతున్న నివాస, వాణిజ్య ప్రాంతాల్లో ఏటా నికరంగా 200 నుంచి 250 కొత్త శాఖలను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. సీఎన్‌బీసీ టీవీ18 కథనం ప్రకారం, కొన్ని పాత బ్రాంచ్‌లను హేతుబద్ధీకరించే ప్రక్రియ కూడా కొనసాగుతుందని తెలుస్తోంది. 2026 మార్చి నాటికి ఎస్‌బీఐలో మొత్తం ఉద్యోగుల సంఖ్య 2.45 లక్షలకు పైగా ఉంది. తాజా నియామకాలతో బ్యాంకు తన సేవలను మరింత విస్తృతం చేయాలని భావిస్తోంది.

# కాంగ్రెస్ 1000 రోజుల పాలన పై దూసకల్ గ్రామంలో బీఆర్ఎస్ నిరసన





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్న సందర్భంగా ఆ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు,వాటి అమలు తీరును ప్రజల ముందుంచేందుకు బీఆర్ఎస్ చేపట్టిన కాంగ్రెస్ బాకీ కార్డుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం రోజు దూస కల్ గ్రామంలో బీఅర్ఎస్ పార్టీ నాయకులు ఇంటింటికీ తిరిగి బాకీ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం కేవలం నిరసనకే పరిమితం కాకుండా, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రజలకు గుర్తుచేసి,ఆ హామీల్లో ఏవి అమలయ్యాయి. ఏవి ఇంకా బాకీ ఉన్నాయి అనే విషయాలను ప్రజలకు వివరించడమే ప్రధాన ఉద్దేశం అని నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా గ్రామంలోని పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించిన ఆయన..కాంగ్రెస్ పాలనలో పల్లెల్లో పారిశుద్ధ్య వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందని, చెత్త సేకరణ, డ్రైనేజీ, పరిసరాల పరిశుభ్రత వంటి కనీస సౌకర్యాల విషయంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన 'పల్లె ప్రగతి' కార్యక్రమంతో గ్రామాల రూపురేఖలను మార్చి, పారిశుద్ధ్యం, హరితహారం, మౌలిక వసతులు,గ్రామ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చామని గుర్తు చేశారు.ప్రతి గ్రామాన్ని పరిశుభ్రంగా, పచ్చదనంతో, ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో అప్పటి ప్రభుత్వం నిరంతరం పనిచేసిందన్నారు.ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజల తరఫున ప్రశ్నించడమే 'కాంగ్రెస్ బాకీ కార్డుల' కార్యక్రమం స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించి, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని తెలిపారు.పల్లెల అభివృద్ధి కోసం బీఆర్ఎస్ హయాంలో చేసిన పనులకు, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో పల్లెల్లో నెలకొన్న దుస్థితికి మధ్య ఉన్న తేడాను ప్రజలకు వివరిస్తూ.. హామీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీసే ప్రజా ఉద్యమంగా ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తామని నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కావాలి అశోక్ యాదవ్,మాజీ ఎంపీటీసీ యాదయ్య ,కల్లేపల్లి బాలు,జుట్టు రాజు,మల్లెల రవి కేషమోని మల్లేష్ ,నందిగామ లక్ష్మయ్య,చౌలపల్లి విష్ణు,పాండు,చిలకమర్రి సత్తయ్య,ధారా నరేష్,కుమ్మరి రాజు,కుమ్మరి రమేష్ , బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, పాల్గొన్నారు.

# ప్రజలు, టెక్నాలజీ, మూలధనంపై చైనా ఉక్కుపాదం..



ప్రజలు, మూలధనం, కీలక సాంకేతిక పరిజ్ఞానం దేశం దాటిపోకుండా చైనా ప్రభుత్వం తన పట్టును మరింత బిగిస్తోంది. ఈ క్రమంలోనే, దేశ పౌరులు విదేశాలకు వెళ్లడంపై కఠినమైన నిబంధనలను తీసుకువచ్చింది. పారిశ్రామిక, సాంకేతిక భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని భావిస్తే, పౌరులను దేశం విడిచి వెళ్లకుండా నిరోధించేందుకు అధికారులకు అధికారం కల్పించే ఈ కొత్త నిబంధనలు సెప్టెంబర్ 15 నుంచి అమల్లోకి రానున్నాయి.
సున్నితమైన టెక్నాలజీ, డేటా, నైపుణ్యం కలిగిన నిపుణులు విదేశాలకు తరలిపోకుండా నిరోధించేందుకు చైనా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో ఇది ఒక కీలక ముందడుగుగా భావిస్తున్నారు. చైనాకు చెందిన 'మనుస్' అనే ఏఐ స్టార్టప్‌ను 2 బిలియన్ డాలర్లతో కొనుగోలు చేసేందుకు మెటా చేసిన ప్రతిపాదనను చైనా అడ్డుకోవడమే ఇందుకు నిదర్శనం. జాతీయ భద్రత కారణాలను చూపుతూ ఈ ఏడాది ఏప్రిల్‌లో ఈ ఒప్పందాన్ని డ్రాగన్ సర్కార్ రద్దు చేసింది.
కొత్త నిబంధనల ప్రకారం, టెక్నాలజీ దిగుమతి లేదా ఎగుమతి నిబంధనలను ఉల్లంఘించి దేశ పారిశ్రామిక, సాంకేతిక భద్రతకు ప్రమాదం కలిగించే వారిని దేశం విడిచి వెళ్లకుండా నిరోధించవచ్చు. అంతేకాకుండా, విదేశాల్లో చైనా జాతీయ భద్రతకు, ప్రయోజనాలకు హాని కలిగించే నేరాలకు పాల్పడిన వారు దేశానికి తిరిగి వచ్చిన తర్వాత ఆరు నెలల నుంచి మూడేళ్ల వరకు విదేశాలకు వెళ్లకుండా నిషేధం ఎదుర్కోవలసి ఉంటుంది.
ఈ ఆంక్షలు కేవలం ప్రజలకే పరిమితం కాలేదు. దేశం నుంచి మూలధనం, వ్యూహాత్మక ఆస్తులు తరలిపోకుండా నిరోధించే ప్రయత్నాల్లో భాగంగానే ఈ చర్యలు తీసుకుంటున్నారు. ఒక వ్యక్తి ఏడాదికి 50,000 డాలర్ల కంటే ఎక్కువ విదేశీ మారకాన్ని కొనుగోలు చేయరాదనే నిబంధన ఇప్పటికే ఉంది. గతేడాది చైనా వాణిజ్య మిగులు రికార్డు స్థాయిలో 1.2 ట్రిలియన్ డాలర్లకు చేరడంతో, చైనా కంపెనీలు, వ్యక్తులు భారీగా విదేశీ ఆస్తులు, సెక్యూరిటీలలో పెట్టుబడులు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో విదేశీ పెట్టుబడులపై ప్రభుత్వం నిఘాను మరింత కఠినతరం చేసింది.ఇదేకాకుండా, చైనా స్టేట్ కౌన్సిల్ జూన్‌లో విడుదల చేసిన నిబంధనల ప్రకారం, పెట్టుబడిదారులు నియంత్రిత టెక్నాలజీ, డేటా, ఇతర నియంత్రిత వస్తువులు లేదా సేవలను విదేశీ పెట్టుబడుల ద్వారా ఎగుమతి చేయడాన్ని నిషేధించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు, వీసా ఆంక్షలు, ఇండస్ట్రీ బ్లాక్‌లిస్టింగ్ వంటి శిక్షలు విధించనున్నారు.

## కాంగ్రెస్ మాట విని తప్పుడు కేసులు పెడితే వదిలే ప్రసక్తే లేదు..

# వడ్డీతో సహా చెల్లిస్తాం: పోలీసులకు పువ్వాడ వార్నింగ్

**బీఆర్ఎస్ పాలనలో పోలీసులు పారదర్శకంగా విధులు నిర్వహించారన్న పువ్వాడ**
**కాంగ్రెస్ నేతలకు అనుకూలంగా పనిచేస్తున్న అధికారుల జాబితా తమ వద్ద ఉందని వెల్లడి**
**బీఆర్ఎస్ శ్రేణులను వేధిస్తే మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరిక**



అధికార కాంగ్రెస్ నేతల ఒత్తిళ్లకు లొంగిపోయి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తే చూస్తూ ఊరుకోబోమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత పువ్వాడ అజయ్ కుమార్ పోలీసు యంత్రాంగాన్ని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైరా నియోజకవర్గం జూలూరుపాడులో జరిగిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. బీఆర్ఎస్ హయాంలో 'ఫ్రెండ్లీ పోలీసింగ్'తో పారదర్శకంగా విధులు నిర్వహించిన వ్యవస్థను, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం తమ స్వార్థ రాజకీయాల కోసం హింసను ప్రోత్సహించేలా వాడుకుంటోందని తీవ్రంగా ధ్వజమెత్తారు.
తెలంగాణలో మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేసిన పువ్వాడ... అధికార పార్టీ నేతల సైగలకు అనుగుణంగా తప్పుడు పనులు చేస్తున్న పోలీసు అధికారుల జాబితా తమ దగ్గర సిద్ధంగా ఉందన్నారు. చట్టాన్ని పక్కనపెట్టి బీఆర్ఎస్ శ్రేణులను వేధిస్తున్న ప్రతీ ఒక్కరికీ భవిష్యత్తులో వడ్డీతో సహా చెల్లిస్తామని ఘాటుగా హెచ్చరించారు. పోలీసులు ఇకనైనా ఏకపక్ష వైఖరిని విడనాడి, నిష్పాక్షికంగా చట్టపరిధిలో పనిచేయాలని సూచించారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# ప్రారంభమైన బిగ్ బాస్ తెలుగు సీజన్ 10

**హౌస్‌లోకి అడుగుపెట్టిన 16 మంది కంటెస్టెంట్లు**

**గుప్పెడంత మనసు 'రిషి' సహా పలువురు ప్రముఖులు**

**ఈసారి సామాన్యులకు కూడా అవకాశం కల్పించిన బిగ్ బాస్**




తెలుగు టెలివిజన్ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న రియాలిటీ షో 'బిగ్ బాస్ తెలుగు' పదో సీజన్ అట్టహాసంగా ప్రారంభమైంది. కింగ్ నాగార్జున మరోసారి హోస్ట్‌గా తనదైన శైలిలో ప్రేక్షకులను అలరించారు. ఈ సీజన్‌లో సినీ, టీవీ ప్రముఖులతో పాటు, 'అగ్నిపరీక్ష' అనే ప్రత్యేక ప్రక్రియ ద్వారా ఎంపికైన సామాన్యులకు కూడా అవకాశం కల్పించారు. గ్రాండ్ లాంచ్ ఎపిసోడ్‌లో మొత్తం 16 మంది కంటెస్టెంట్లు బిగ్ బాస్ హౌస్‌లోకి అడుగుపెట్టారు. విభిన్న నేపథ్యాల నుంచి వచ్చిన ఈ కంటెస్టెంట్ల పూర్తి వివరాలు కింద ఉన్నాయి.

**బిగ్ బాస్ 10 కంటెస్టెంట్లు:**

**1. దేబ్జానీ మోదక్:** 'ఎన్నెన్నో జన్మల బంధం' సీరియల్‌తో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఈమె, 'గిరగిరా గింగిరాని వే' పాటకు డ్యాన్స్ చేస్తూ హౌస్‌లోకి మొదటి కంటెస్టెంట్‌గా ప్రవేశించారు.

**2. త్రిగుణ్:** గతంలో అదిత్ అరుణ్ పేరుతో సినిమాలు చేసిన ఈయన, తన పేరును త్రిగుణ్‌గా మార్చుకున్నారు. బిగ్ బాస్ ద్వారా ఫ్యామిలీ ఆడియన్స్‌కు మరింత దగ్గరవ్వాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

**3. ఝాన్సీ:** సింగర్‌గా గుర్తింపు పొందిన ఈమె, గోల్డెన్ టికెట్ విజేతగా హౌస్‌లోకి అడుగుపెట్టారు. 'రైతు బిడ్డ' పాటను భావోద్వేగంగా పాడి అందరినీ ఆకట్టుకున్నారు.

**4. సుధీర్ రెడ్డి (సుధీర్ టాక్స్):** ప్రముఖ పాడ్‌కాస్టర్‌గా సోషల్ మీడియాలో గుర్తింపు పొందిన సుధీర్, తన జీవితంలోని కష్టాలను నాగార్జునతో పంచుకున్నారు.

**5. అమన్:** 'అగ్నిపరీక్ష'లో అత్యధిక ఓట్లు సాధించి ఎంపికైన కంటెస్టెంట్. తాను గేమ్‌లో ఎట్టిపరిస్థితుల్లోనూ ఫ్లిప్ అవ్వనని ఆత్మవిశ్వాసం వ్యక్తం చేశారు.

**6. చైత్ర రాయ్:** 'అష్టాచమ్మా' సీరియల్‌తో 'స్వప్న'గా పేరుగాంచిన ఈమె, పెళ్లి తర్వాత బరువు పెరగడంపై వచ్చిన ట్రోలింగ్‌ను సవాలుగా తీసుకుని 20 కిలోలు తగ్గినట్లు తెలిపారు.

**7. ఆటో రామ్ ప్రసాద్:** జబర్దస్త్ కమెడియన్‌గా సుపరిచితుడైన రామ్ ప్రసాద్, తనదైన కామెడీ పంచ్‌లతో హౌస్‌లోకి ఎనర్జిటిక్‌గా ఎంట్రీ ఇచ్చారు.

**8. షాలిని:** జ్యూరీ సభ్యుడు నవీన్ చేత ఎంపికైన సామాన్యురాలు. తాను చాలా ఎక్కువగా మాట్లాడతానని, నాగార్జునను ప్రశంసలతో ముంచెత్తారు.

**9. టెంపర్ వంశీ:** 'టెంపర్', 'నేనింతే' వంటి చిత్రాల్లో ప్రతినాయక పాత్రలతో గుర్తింపు పొందిన వంశీ, తనలోని ఎమోషనల్, ఫ్యామిలీ మ్యాన్ కోణాన్ని ప్రేక్షకులకు చూపించాలని వచ్చానని చెప్పారు.

**10. సృష్టి వ్యాకరణం:** జ్యూరీ సభ్యురాలు, మాజీ కంటెస్టెంట్ శ్రీముఖి చేత ఎంపికయ్యారు. తన సంకల్పమే తన బలమని, ఇతరులను సులభంగా నమ్మడం బలహీనత అని తెలిపారు.

**11. నరేశ్ (పొట్టి నరేశ్):** జబర్దస్త్ ఫేమ్ నరేశ్, గూగుల్‌లో తన పేరు వెతికితే 'బిగ్ బాస్ 10 నరేశ్' అని రావాలనే లక్ష్యంతో షోలోకి వచ్చినట్లు చెప్పారు.

**12. ఆర్జే చరణ్:** ఆడియన్స్ ఓటింగ్ ద్వారా ఎంపికైన చరణ్, తన చుట్టూ ఉన్నవారిని నవ్వించడమే తన బలమని, తాను చిరంజీవికి, నాగార్జునకు పెద్ద అభిమానినని పేర్కొన్నారు.

**13. కృష్ణుడు:** 'హ్యాపీ డేస్', 'వినాయకుడు' వంటి చిత్రాలతో నటుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న కృష్ణుడు, తన బరువు వెనుక ఉన్న కథను పంచుకున్నారు. తాను అమాయకుడిని కాదని, తనలోని మరో కోణాన్ని చూపిస్తానని అన్నారు.

**14. వర్షిణి సౌందరరాజన్:** యాంకర్, నటిగా గుర్తింపు పొందిన వర్షిణి, మొదట బిగ్ బాస్ ఆలోచన లేకపోయినా, కాలక్రమేణా ఆసక్తి పెరిగిందని తెలిపారు.

**15. రోహిత్:** జ్యూరీ సభ్యురాలు బిందు మాధవి ఎంపిక చేసిన సామాన్య యువకుడు. హౌస్‌లోని ఒకరిపై నీళ్లు చల్లాలనే టాస్క్‌ను సున్నితంగా తిరస్కరించి తన వ్యక్తిత్వాన్ని చాటుకున్నారు.

**16. ముఖేశ్ గౌడ:** 'గుప్పెడంత మనసు' సీరియల్‌తో 'రిషి'గా తెలుగు రాష్ట్రాల్లో విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకున్న ముఖేశ్, 16వ కంటెస్టెంట్‌గా అడుగుపెట్టారు. తన మాతృభాష కన్నడ అయినా, తెలుగు తన గుండెల్లో ఉందని, తన తెలుగులో తప్పులుంటే క్షమించాలని కోరారు.

ఇలా విభిన్న రంగాలకు, నేపథ్యాలకు చెందిన 16 మందితో బిగ్ బాస్ హౌస్ కళకళలాడుతోంది. వంద రోజుల పాటు సాగే ఈ ప్రయాణంలో ఎవరు ప్రేక్షకులను మెప్పించి టైటిల్ విజేతగా నిలుస్తారో వేచి చూడాలి.

## తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ఎన్నికల్లో 'మన ప్యానెల్' హవా.. అధ్యక్షుడిగా సి. కల్యాణ్

తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ (2026-28) నూతన కార్యవర్గం కోసం జరిగిన ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. ఈ ఎన్నికల్లో 'మన ప్యానెల్', 'ప్రోగ్రెసివ్ ప్యానెల్' మధ్య ప్రధాన పోటీ జరగ్గా, 'మన ప్యానెల్' స్పష్టమైన ఆధిక్యాన్ని ప్రదర్శించి కీలక పదవులను కైవసం చేసుకుంది. అధ్యక్ష పదవికి సి. కల్యాణ్ ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే.

ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన పోలింగ్‌లో మొత్తం 1,168 మంది సభ్యులకు గాను 643 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటించారు. అత్యంత కీలకమైన కోశాధికారి (ట్రెజరర్) పదవికి 'మన ప్యానెల్' నుంచి పోటీ చేసిన చదలవాడ శ్రీనివాసరావు విజయం సాధించారు.

ఉపాధ్యక్ష పదవులకు 'మన ప్యానెల్' నుంచి మోహన్ వడ్లపల్లి, 'ప్రోగ్రెసివ్ ప్యానెల్' నుంచి దామోదర్ ప్రసాద్ ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా 'మన ప్యానెల్' అభ్యర్థులు అమ్మిరాజు, తుమ్మలపల్లి రామ సత్యనారాయణ గెలుపొందారు.



ఇక కార్యవర్గ సభ్యుల (ఈసీ మెంబర్స్) పదవుల్లోనూ 'మన ప్యానెల్' హవా కొనసాగింది. ఈ ప్యానెల్ నుంచి పద్మిని, ఏషియన్ సునీల్, మోహన్ గౌడ్, శివలెంక కృష్ణప్రసాద్, దానయ్య సహా మొత్తం 12 మంది విజయం సాధించగా, 'ప్రోగ్రెసివ్ ప్యానెల్' నుంచి మైత్రీ రవి, నిరంజన్ రెడ్డి, డీఎస్ రావు సహా ముగ్గురు గెలుపొందారు. అయితే, ప్రధాన కార్యదర్శి పదవి ఎన్నిక కోర్టు కేసు కారణంగా ప్రస్తుతానికి నిలిచిపోయింది.

ఈ సందర్భంగా అధ్యక్షుడు సి. కల్యాణ్ మాట్లాడుతూ, తమ ప్యానెల్‌కు దాదాపు 95 శాతం మద్దతు ఇచ్చిన నిర్మాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా చిన్న నిర్మాతలు ఎదుర్కొంటున్న విడుదల సమస్యలు, ఆర్థిక ఇబ్బందులపై దృష్టి సారిస్తామన్నారు. వారి కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని, త్వరలోనే ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. తన ఏకగ్రీవ ఎన్నికకు సహకరించిన బండ్ల గణేశ్‌కు ధన్యవాదాలు చెబుతూ, ఇకపై అందరం కలిసికట్టుగా పనిచేస్తామని పిలుపునిచ్చారు.

## చంద్రబోస్ తనయుడి వివాహ రిసెప్షన్ హాజరైన మెగాస్టార్ చిరంజీవి



ప్రముఖ సినీ గీత రచయిత, ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్ ఇంట పెళ్లి సందడి నెలకొంది. ఈ వేడుకకు మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చంద్రబోస్, ప్రముఖ కొరియోగ్రాఫర్ సుచిత్ర దంపతుల కుమారుడు నంద వివాహం శృతి అనే యువతితో అత్యంత వైభవంగా జరిగింది. తాజాగా హైదరాబాద్‌లో జరిగిన ఈ వివాహ రిసెప్షన్ వేడుకలకు కుటుంబ సభ్యులు, ఆప్తమిత్రులతో పాటు టాలీవుడ్ ప్రముఖులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమానికి హాజరైన మెగాస్టార్ చిరంజీవి, నూతన దంపతులు నంద వనమాలి, శృతిలను మనసారా ఆశీర్వదించారు. చంద్రబోస్ దంపతులతో తనకున్న ఆత్మీయ అనుబంధాన్ని చాటుకుంటూ, వారి కుటుంబ వేడుకలో పాలుపంచుకున్నారు. చిరంజీవి రాకతో వేడుక ప్రాంగణంలో కొత్త శోభ సంతరించుకుంది. ఆయన నూతన వధూవరులతో ఫొటోలు దిగి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ పెళ్లి వేడుకలో మరో విశేషం అందరినీ ఆకట్టుకుంది. చంద్రబోస్ తన భార్య సుచిత్రతో కలిసి వేదికపై ఉత్సాహంగా స్టెప్పులేశారు. అలాగే, సుచిత్ర తన నూతన కోడలు శ్రుతితో కలిసి డ్యాన్స్ చేసి అందరినీ అలరించారు. అత్తాకోడళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచిన ఈ దృశ్యాలు ఆహూతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ ఆనంద క్షణాలకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



## నందమూరి మోక్షజ్ఞ అరంగేట్రం ఖరారు..

నందమూరి అభిమానులు, తెలుగు సినీ ప్రేక్షకులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న శుభ తరుణం రానేవచ్చింది. నటసింహం నందమూరి బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ తేజ సినీ అరంగేట్రం అధికారికంగా ఖరారైంది. అతడి తొలి చిత్రానికి 'బింబిసార' వంటి బ్లాక్‌బస్టర్‌ను అందించిన యువ దర్శకుడు మల్లిడి వశిష్ట దర్శకత్వం వహించనున్నారు. టాలీవుడ్‌లోని అగ్ర నిర్మాణ సంస్థల్లో ఒకటైన మైత్రీ మూవీ మేకర్స్ ఈ ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని నిర్మించనుంది. మోక్షజ్ఞ పుట్టినరోజు సందర్భంగా ఆదివారం ఈ భారీ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు మైత్రీ మూవీ మేకర్స్ తమ సోషల్ మీడియా ఖాతా ద్వారా ఒక ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ ఫొటోలో బాలకృష్ణ, మోక్షజ్ఞ, దర్శకుడు వశిష్ట ముగ్గురూ కలిసి కనిపించడంతో అభిమానుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఈ సందర్భంగా మేకర్స్ ఒక పవర్‌ఫుల్ క్యాప్షన్‌ను జోడించారు. "డెన్‌ను వదిలిన కూన ఇప్పుడు సింహంలా అడవిలోకి ఎంటర్ అయింది" అంటూ మోక్షజ్ఞ ఎంట్రీని అభివర్ణించారు. ఈ ప్రకటనతో నందమూరి అభిమానుల్లో పండుగ వాతావరణం నెలకొంది. కొన్నేళ్లుగా మోక్షజ్ఞ ఎంట్రీ గురించి జరుగుతున్న ఊహాగానాలకు ఈ ప్రకటనతో పూర్తిస్థాయిలో తెరపడినట్లయింది. 'బింబిసార' చిత్రంతో దర్శకుడిగా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న వశిష్ట, ఇప్పుడు నందమూరి వారసుడిని హీరోగా పరిచయం చేసే బాధ్యతను తీసుకోవడం ప్రాజెక్ట్‌పై అంచనాలను రెట్టింపు చేసింది. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలతో పాటు, చిత్రీకరణ ఎప్పుడు ప్రారంభమవుతుందనే విషయాలను వెల్లడించనున్నట్లు తెలుస్తోంది.

## విలన్‌గా సుహాస్, హీరోగా సూరి.. ఉత్కంఠ రేపుతున్న 'మండాడి' ట్రైలర్!



టాలీవుడ్‌లో విలక్షణ నటనతో గుర్తింపు పొందిన యంగ్ యాక్టర్ సుహాస్, కోలీవుడ్‌లో విలన్‌గా అడుగుపెడుతున్నారు. తమిళ నటుడు సూరి హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'మండాడి'లో సుహాస్ ప్రతినాయకుడి పాత్ర పోషిస్తున్నారు. సెప్టెంబర్ 10న విడుదల కానున్న ఈ సినిమాకు సంబంధించి తాజాగా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ ట్రైలర్ సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది.

తమిళనాడు తీరప్రాంతంలో జరిగే సాంప్రదాయ పడవ పందేల (సైల్ బోట్ రేసింగ్) నేపథ్యంలో ఈ సినిమాను హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిస్తున్నారు. 'సెల్ఫీ' ఫేమ్ మతిమారన్ పుగళేంది దర్శకత్వం వహిస్తుండగా, ప్రముఖ దర్శకుడు వెట్రిమారన్ క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించడం విశేషం. సూరి సరసన మహిమా నంబియార్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సత్యరాజ్, రవీంద్ర విజయ్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

ఈ సినిమాకు జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. ట్రైలర్‌లో ఆయన అందించిన నేపథ్య సంగీతం ఆకట్టుకుంటోంది. ఈ చిత్రం కోసం హీరో సూరి, విలన్ పాత్రధారి సుహాస్ డూప్స్ లేకుండా సముద్రంలో రిస్కీ యాక్షన్ సన్నివేశాల్లో, బోట్ రేస్ సీక్వెన్స్‌లలో నటించినట్లు చిత్రబృందం తెలిపింది. ఇది వారి పాత్రల పట్ల ఉన్న నిబద్ధతను తెలియజేస్తోంది.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613